
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీపొట్టిశ్రీరాములు **నెల్లూరు** జిల్లా వార్తలు

గురువారం 17 అక్టోబరు 2024







జలదంకి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చీకటివాగు, చిప్పలేరువాగు

నెల్లూరు : తల్పగిరి కాలనీని చుట్టేసిన వరదనీరు





అనంతసాగరం : సోమశిలలో నేలవాలిన వరిపైరు

అతలాకుతలం

- రోజంతా ఒకటే వాన ● పోర్టులో మూడో నెంబరు హెచ్చరిక జారీ ● పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు ● సురక్షిత ప్రాంతాలకు లోతట్టువాసులు
- సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ ● నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లా చిగురుటాకులా వణికిపోతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. ఇక్కడున్న ప్రజలను అధికార యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. మొన్నటిదాకా నెర్రెలిచ్చిన చెరువులూ జలకళను సంతరించుకుంటున్నాయి. రోడ్లపై వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో కొన్నిగ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. ఎగువ నుంచి వరద వచ్చి చేరుతుండటంతో సోమశిల డ్యాం నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. పెన్నా నదిలోనూ వరద ప్రవాహం ఎక్కువవుతుండటంతో పరివాహక ప్రాంతాలను అప్రతమత్తం చేశారు. కండలేరు, రాళ్లపాడు, కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లకు వరద చేరుతోంది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది.

నెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం జిల్లాను అతలాకుతలం చేస్తోంది. వరుసగా మూడో రోజు కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బుధవారం కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. బుధవారం ఒక్కరోజే జిల్లాలో సరాసరి 83.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జలదంకిలో 185 మి.మీ, కావలిలో 174.4, నెల్లూరు నగరంలో 135.6, నెల్లూరు రూరల్‌లో 123.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకూ భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత సూళ్లూరుపేట-పొన్నేరి మధ్య తీరం వాయుగుండం దాటుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. కృష్ణపట్నం పోర్టులో మూడవ నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వాయుగుండం తీరానికి వస్తున్న కొద్దీ వర్షం ఎక్కువవడంతోపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు కూడా ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలకు నెల్లూరు నగరంలో పరిస్థితులు దారుణంగా మారాయి. వర్షపు నీరంతా రోడ్లపైనే పారుతోంది. పలుచోట్ల మోకాలిలోతు పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమ్యాయి. జిల్లాలో పలు చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ ప్రభావంతో పలు ప్రాంతాల్లో రోడ్లకు గండ్లు పడడంతో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాల నేపథ్యంలో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకూ 14 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడికి 870 మందిని తరలించారు. వీరికి ఆహారంతో పాటు అన్ని వసతులు కల్పించారు.

● నేడు కూడా సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు గురువారం కూడా సెలవు ప్రకటించారు. శుక్రవారం నుంచి యథావిధిగా విద్యాసంస్థలు తెరుచుకుంటాయని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో సోమశిల జలాశయానికి నీటి ప్రవాహం పెరుగుతోంది. బుధవారం ఉదయం 6 గంటలకు 10,920 క్యూసెక్కుల వస్తుండగా సాయంత్రానికి 20,161 క్యూసెక్కులకు చేరింది. గురువారానికి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి గంటకు తీస్తున్న నీటి నమోదు వివరాలను ఎస్ఈ వెంకటరమణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. డ్యాంలో 53.071 టీఎంసీల నీరు నిల్వ ఉండగా దిగువ డెల్టాకు 50, కండలేరుకు 6,000, ఉత్తర కాలువకు 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● సంగం బ్యారేజీ వద్ద..

● సంగం (ఆంధ్రజ్యోతి): సంగం బ్యా రేజీకి సుమారు 4,400 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.5 అడుగులకు చేరింది. కనిగిరి ప్రధాన కాలువకు 100 క్యూసెక్కులు, నెల్లూరు చెరువుకు 50 క్యూసెక్కులు, నెల్లూరు తాగునీటికి 40 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. మిగిలిన వరదను నెల్లూరు బ్యారేజీకి విడుదల చేస్తున్నట్లు ఏఈ వినయ్ కుమార్ తెలిపారు. ● లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 12.4 అడుగులకు చేరింది. 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇది మరింతే పెరిగే అవకాశం ఉందని ఏఈ చంద్రమౌళి తెలిపారు.

● అధికారులకు సెలవుల రద్దు

బుధవారం అతిభారీ వర్షాలు కురవడం, గురువారం కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జీ కృష్ణకాంత్‌లు పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ నివారణ చర్యలను పర్యవేక్షించారు. ఇప్పటికే కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అక్కడకు వస్తున్న ప్రతీ కాల్‌ను తీసుకొని సంబంధిత అధికారులను అలర్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే దసరా సెలవులకు వెళ్లిన అధికారులు, ఉద్యోగులు తక్షణమే విధులకు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితులు చక్కబడే వరకూ అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకించారు. జిల్లాస్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి ఉద్యోగుల వరకూ ఆయా హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అలానే పోలీసు సిబ్బందితోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు. ప్రమాదకర కల్వర్టర్లు, వంతెనల వద్ద పోలీసు పహారా కొనసాగుతోంది. విద్యుత్ శాఖ కూడా తన సిబ్బంది మొత్తాన్ని 24 గంటలూ విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చింది. తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎక్కడికక్కడ నీటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సమస్య ఏర్పడినా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా స్కీమ్‌ల వద్ద జనరేటర్లు అందుబాటులో ఉంచారు.

748.5 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

నెల్లూరు (వ్యవసాయం) : జిల్లాలో 748.5 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. 610 ఎకరాల్లో వరిపైరు నీట మునిగింది. అదేవిధంగా 22 ఎకరాల్లో నారుమడులు నీటిలో నానుతున్నాయి. 100 ఎకరాల్లో పొగాకు పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో దాదాపు 45గ్రామాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. చేజర్లలో మండలంలో 175, విడవలూరులో 5, జలదంకిలో 8, సీతారామపురంలో 65.5, అనంతసాగరం 350, కలిగిరిలో 10 ఎకరాల్లో వరిపైరు అదేవిధంగా వింజమూరు మండలంలో 10, కొడవలూరులో 4.5, కొండాపురంలో 5ఎకరాల్లో వరినారు మడులు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. వింజమూరు మండలంలో 10, కలిగిరిలో 20, కొండాపురంలో 10 ఎకరాల్లో పొగాకు దెబ్బతిన్నది. కావలి మండలం చలంచర్ల గ్రామంలో 2, దగదర్తి మండలం ఉలవపాళ్లలో 3, బోగోలు మండలం తాళ్లూరులో 2.5, పొదలకూరు మండలం బట్టులపల్లిపాడు గ్రామంలో 9 ఎకరాల్లో పూలు, కర్బూజ, కూరగాయలు, మిరప పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.

మండలం పేరు	వర్షపాతం (మి.మీ)
జలదంకి	185.0
కావలి	174.4
నెల్లూరు అర్బన్	135.6
నెల్లూరు రూరల్	123.8
కొండాపురం	108.2
టీపీగూడూరు	103.4
పొదలకూరు	103.2
కందుకూరు	102.8
ఇందుకూరుపేట	99.8
కోవూరు	99.2
లింగసముద్రం	97.6
సీతారాంపురం	97.2
వరికుంటపాడు	95.6
వింజమూరు	92.8
సైదాపురం	88.2
ఉదయగిరి	87.8
గుడ్లూరు	85.2
వెంకటాచలం	80.8
ముత్తుకూరు	80.2
కలిగిరి	80.2
వలేటివారి పాలెం	77.6
కలువాయి	76.2
ఉలవపాడు	72.6
దగదర్తి	68.4
దుత్తలూరు	68.4
బుచ్చి	68.2
మనుబోలు	65.2
విడవలూరు	65.2
కొడవలూరు	64.6
రాపూరు	62.4
అనంతసాగరం	58.2
బోగోలు	51.6
అల్లూరు	50.2
సంగం	47.6
ఆత్మకూరు	44.6
చేజర్ల	38.4
మర్రిపాడు	35.4
ఏఎస్‌పేట	35.4



వెంకటాచలం : సర్వేపల్లి రిజర్వాయర్ వద్ద సిమెంట్ బస్తాలు వేస్తూ..



సైదాపురం : చెరువును తలపిస్తున్న రోడ్డు



నెల్లూరు : పొగతోటలో మురుగు, వర్షపునీరు కలిసి ప్రవహిస్తుండటంతో అవస్థలు



వరికుంటపాడులో నక్కలగండివాగు



సైదాపురం : కైవల్యానదికి జలకళ



కొండాపురంలో మిడతవాగు



అల్లూరు : ఇస్కపల్లి తీరంలో పడవలు



బిట్రగుంట : తాటిచెట్లపాళెం వద్ద కసురుమీదున్న కడలి



నెల్లూరు : కేవీఆర్ పెట్రోలు బంకు వద్ద రోడ్డుపై నిలిచిపోయిన వరదనీరు

కొత్త దుకాణాలు

పాత ధరలు

- ప్రైవేటు మద్యం దుకాణాల ప్రారంభం
- పూర్తిస్థాయిలో అందని స్టాకు.. వందషాపులే ఆరంభం
- పాత బ్రాండ్లను చూసి అవాక్కయిన మందుబాబులు
- వారం రోజులపాటు తప్పదన్న ఎక్సైజ్ అధికారులు
- సాంకేతిక సమస్యలు పరిష్కారం తర్వాతే కొత్త బ్రాండ్లు



కలువాయిలో మద్యం కోసం గుమికూడిన మందుబాబులు

కొత్త మద్యం పాలసీ అమలులోకి వచ్చినా మందుబాబులను 'జే' బ్రాండ్లు వదలనంటున్నాయి. కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వారం రోజుపాటు వైసీపీ సర్కారు నాటి బ్రాండ్లనే అదే ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం ప్రారంభమైన కొత్త దుకాణాల వద్దకు వెళ్లిన మందుబాబులు 'జే' బ్రాండ్లను చూసి నివ్వెరపోయారు. ధర కూడా తగ్గకపోవడంతో వ్యాపారులను నిలదీశారు. వారం రోజుపాటు ఇవే దొరుకుతాయని ఎక్సైజ్ అధికారులు చెప్పడంతో అంతా శాంతించారు.

- 6లో..

మరో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

● మత్స్యకారులకు కలెక్టర్, ఎస్పీ సూచన



ఇందుకూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మరో 24గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని, సముద్రంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ వేటకు వెళ్లొద్దని కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ మత్స్యకారులకు సూచించారు. బుధవారం మండలంలోని మైపాడు సముద్రతీరంలో వారు పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. జలదంకి, కావలిలో అత్యధిక వర్షపాతం నమోదైందన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి భోజనం, మంచినీరు, మందులు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సుమారు 500 మందినిపైగా పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ పెన్నానది పరివాహక ప్రాంతంలో కట్టలు బలహీనంగా ఉన్నచోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాజ్‌వేల వద్ద పోలీసు పహరా ఉంచామన్నారు. ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉంటూ ఈ రెండురోజులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. వారి వెంట నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూష, సీఐ సుధాకర్‌రెడ్డి, మండల తహసీల్దారు, ఎస్ఐ నాగార్జునరెడ్డి, స్థానిక నాయకులు కొండూరు కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

బాబూ.. ఏది జాబు!

● వలంటీర్ల పునర్నియామకం ఎప్పటికో!?

7





భైరవకోనలో కనువిందు చేస్తున్న జలపాతం



శివుని పాదాలు తాకుతూ ప్రవహిస్తున్న గంగమ్మ

ఆహ్లాదకరంగా భైరవకోన

ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలోని జలపాతం కనువిందు చేస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతంలో నుంచి నీరు వచ్చి పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల వారు జలపాతాన్ని తిలకించేందుకు తరలివస్తున్నారు. అయితే, నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి, హెచ్చరికలు జారీ చేశారు. కాగా, వర్షాలకు భైరవకోన ప్రాంతంలోని కుంటలకు, చెరువులకు నీరు భారీగా వచ్చి చేరుతోంది.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)



అమ్మా.. భోజనం అందుతోందా!?

'అమ్మా మీకు భోజనం అందుతోందా!?. మందులు అన్నీ సక్రమంగా ఇస్తున్నారా!? సౌకర్యాలకేం కొదవలేదు కదా!' అంటూ కలెక్టర్ ఆనంద్ పునరావాసంలో తలదాచుకున్న ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్‌తోపాటు ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. సౌకర్యాల కల్పనపై అక్కడున్న చిన్నపిల్లల తల్లులతో కలెక్టర్ ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఇళ్లు లేనివారికి ఇళ్ల మంజూరుతోపాటు బకింగ్‌హామ్ కాలువ మీద వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

- ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి)



2 పడవులు.. ఏడుగురు గజ ఈతగాళ్లు

● విపత్తును ఎదుర్కొనేందుకు అధికారుల ఏర్పాట్లు

మండలంలోని కోలగట్ల గ్రామంలో రెండు బోట్లు, ఏడుగురు గజ ఈతగాళ్లను రెవెన్యూ అధికారులు బుధవారం సిద్ధం చేశారు. భారీ వర్షాలతో బీరాపేరు, బొగ్గేరు వాగులు ప్రవాహించి సంగం బ్యారేజీకి భారీగా వరద వస్తోంది. ఈ వరద వల్ల మండలంలోని కోలగట్ల దళితవాడ, వీర్లగుడిపాడు గ్రామాలు ముంపునకు గురై రాకపోకలు స్తంభించే అవకాశం ఉంది. దీన్ని ఎదుర్కొనేందుకు ముందుస్తుగా రెవెన్యూ అధికారులు పడవలను, గజ ఈతగాళ్లను రప్పించారు. కాగా, దువ్వూరు ఎస్టీ కాలనీలో బడి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్త్ వైరు తగిలి మధు అనే రైతుకు చెందిన గొర్రె మృతి చెందింది.

- సంగం (ఆంధ్రజ్యోతి)

సేవా పురస్కారాల సు'ధీరుడు'

ఆయనో బడిపంతులు. తన పని తాను చేసుకునిపోక సమాజ సేవకు శ్రీకారం చుట్టారు. అటు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూనే వారు ఏ రంగంలోనైనా రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదండోయ్.. సమాజ సేవ, సాహితీవేత్తగా మూడు దశాబ్దాలుగా రాణిస్తూ 2 వేలకుపైగా ప్రశంసలు, 300లకుపైగా పురస్కారాలు అందుకున్న సేవా పురస్కారాల ధీరుడుగా పేరు గడించారు. ఆయనే బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన గండికోట సుధీర్‌కుమార్.

వృత్తి ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి సమాజసేవ

300 అవార్డులు, రెండు వేల ప్రశంసలు



బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎందరో రాజకీయ ఉద్దండులు, స్వాతంత్ర్య సమరయోధులకు నిలయమైన బుచ్చిరెడ్డిపాళెంలో సామాన్య కుటుంబమైన గండికోట రమణయ్య హైమావతి దంపతులకు 1976లో జన్మించిన సుధీర్‌కుమార్‌కు విద్యార్థి దశ నుంచే సేవాతత్వం, సాహిత్యంపై ఆసక్తి ఉండేది. 1998 ఆగస్టు 14న ఉదయగిరి మండలం ఆర్లపడియ గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల పాటు ఆ స్కూల్లో 7వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేశారు. 2002లో సంగం మండలం జెండాదిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులను సైన్స్‌ఫెయిర్‌లో రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి ద్వితీయ బహుమతి సాధించేలా చేశారు. 2011లో బుచ్చిలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు ఎంతో కృషి చేశారు. 2021లో బుచ్చి నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా విద్యార్థులను వ్యాసరచన, వక్తృత్వ, సాంస్కృతిక కార్యక్రమాలలో చైతన్యవంతుల చేసి రాష్ట్రస్థాయిలో ఎన్నో బహుమతులు సాధించేలా చేశారు.

● ప్రధాన పురస్కారాలు

బడుగు, బలహీన, అణగారిన వర్గాల సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్న గండికోటకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో పురస్కారాలు అందజేశాయి. జాతీయ జీవన సాఫల్య పురస్కారం, విద్యా రత్న, సాహిత్య భూషణ్, తెలుగు వెలుగు, కలాం, సర్వేపల్లి, నేషనల్ ఎక్సలెన్సీ, స్మార్ట్ ఇండియా, పర్యావరణ మిత్ర, సేవారత్న, సేవా వజ్ర, ఇండియన్, బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో సహా 300 పురస్కారాలు, 2వేలకుపైగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యాశాఖతోపాటు పలు శాఖల ఉన్నతాధికారులు, సహోపాధ్యాయులు, ఆత్మీయులు, స్నేహితులు, సాహితీవేత్తలు, సామాజికవేత్తలు, బంధువుల ప్రసంశలు పొందారు. సేవలతో పొందే తృప్తి వెలకట్టలేనివని, ఈ పేరు, ప్రతిష్టలు సేవాభావంపై బాధ్యతను పెంచుతుందన్నారు. తాను ఉద్యోగ విరమణ ఆఖరి గడియ వరకు మంచి సమాజం కోసం కృషి చేస్తానని తెలిపారు.

● తెలుగు భాష.. యాసకు...

తెలుగుభాష, యాస శ్వాసగా ఉండే సుధీర్, గిడుగు రామ్మూర్తి జయంతిని విద్యార్థుల నడుమ 3 దశాబ్దాలుగా నిర్వహిస్తూ కవి సమ్మేళనంలో పాల్గొనడం, శ్రీశ్రీ, జాషువా, వేమన, పద్యాలను పిల్లలకు నేర్పించి వారితో పాడించి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. రామచంద్రాపురంలో జాషువా సాహితీ చైతన్య నిలయం ద్వారా విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించేందుకు కృషి చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎక్కువగా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయడం, సెలవు దినాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయడం, పిల్లల్లో పచ్చదనం పరిశుభ్రత, సైన్స్‌పై అవగాహన కల్పించడం చేస్తుంటారు.

మిషన్ వాత్సల్య
కొందరికే..!

● 17వేలకుపైగా దరఖాస్తులు ● 497 మందికే ఆమోదం

● లబోదిబోమంటున్న అనాథ పిల్లలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏ అండా లేని నిస్సహాయ స్థితిలో ఉన్న అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ వాత్సల్య' నీరుగారుతోంది. ఈ పథకానికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు చెల్లించేలా నిర్ణయించారు. ఈ పథకంలో అర్హత పొందిన పిల్లలకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి ముందు నెలకు రూ.2వేల ఆర్థిక సహాయం చేస్తుండగా ఆ తరువాత ఆ మొత్తాన్ని కేంద్రం రూ.4వేలకు పెంచింది. గత వైసీపీ సర్కారు తన వాటా నిధులను అనాథ పిల్లలకు ఇవ్వడానికి కూడా చొరవచూపలేదు. ఈ పథకం అమలుకు అధికార గణాన్ని పల్లెలకు పంపి అర్హులైన అనాథల పేర్లు నమోదు చేయించింది. ఆనాడు జగన్ మామయ్య అండగా ఉండగా భయమెందుకుకనే ఊకదంపుడు ప్రచారం కూడా సాగింది. అయితే ఏడు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది దరఖాస్తులు రావడంతో వాటిని అడ్డదిడ్డంగా కోతకోశారు. అందులో భాగంగా జిల్లాలో 2023-24లో 17వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అందులో కేవలం 497 మందికి మాత్రమే లబ్ధి చేకూర్చేలా ఆమోదించి ఆప్యాయత మాటల్లోనే తప్ప లబ్ధి చేకూర్చే విషయంలో కాదని నిరూపించారు. విధి వంచితుల పట్ల వైసీపీ ప్రభుత్వం నిర్ధయగా వ్యవహరించడంతో అనాథ పిల్లలు లబోదిబోమంటున్నారు.



● అర్హులు ఎవరంటే..

18 ఏళ్లలోపు వయసులో తల్లిదండ్రులు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న, పెంచలేని, విడాకులు తీసుకున్న తల్లిదండ్రుల పిల్లలు, బాల న్యాయ (రక్షణ అండ్ ఆదరణ) చట్టం -2015 ప్రకారం ఆదరణ అవసరమైన చిన్నారులు, బాలకార్మికులు, అక్రమ రవాణాకు గురైన వారు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులు, యాచక పిల్లలు, వీధుల్లో నివశిస్తున్న వారి పిల్లలు, హింసకు దోపిడీకి గురైన వారు, అనాథ ఆశ్రమాల్లోని బాలలు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72వేలు, పట్టణ, నగర ప్రాంతాల్లో రూ.96వేలు, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి చదువుకునే వారు అనర్హులు. గ్రామ, వార్డు స్థాయిలో సచివాలయ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలల కోసం పనిచేస్తున్న ఇతర సిబ్బంది అనాథ పిల్లలను గుర్తించి వారి వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అర్హత కలిగిన వారిని గుర్తించి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారు. ఇది ఏటా నిరంతర ప్రక్రియ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అర్హత ఉన్నా ఆర్థిక సహాయం పొందలేని అనాథలు తమకు న్యాయం జరుగుతుందని, ఆర్థిక సహాయం అందుతుందని ఆశతో ఉన్నారు.

● 17 వేలకు పైగా దరఖాస్తులు

మిషన్ వాత్సల్య పథకానికి జిల్లాలో 2022-23లో 591 మంది, 2023-24లో 497 మందిని మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పథకం కింద అర్హులుగా తేలిన వారిలో 90 శాతం మంది తల్లి లేదా తండ్రిని కోల్పోయిన, హెచ్ఐవీ వ్యాధికి సంబంధించిన వారు కావడం విశేషం. వీరిలో దాదాపు 30 నుంచి 40 శాతం మంది కొవిడ్ సమయంలో తల్లిని లేదా తండ్రిని కోల్పోయారు. ఇవేవీ గత ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు.

నిరంతర ప్రక్రియ



మిషన్ వాత్సల్యకు అనాథ పిల్లలను గుర్తించి వారికి ఆర్థిక సహాయం అందచేయడం నిరంతర ప్రక్రియ. ఈ ఏడాది 497 మందికి ఆర్థిక సహాయం అందచేశాం. ఈ పథకానికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన అనాథలను గుర్తించి వివరాల నివేదికను కలెక్టర్‌కు అందచేస్తాం. ఆమోదం లభించిన తరువాత వారికి ఆర్థిక ఇస్తాము.

- హేనా సుజన్, ఐసీడీఎస్ పీడీ

పోర్టు రంగంలో నైపుణ్యాభివృద్ధికి కృషి

● అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో జితిన్ త్రివేది

ముత్తుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో జితిన్ త్రివేది పేర్కొన్నారు. బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో పోర్టు సంబంధిత కోర్సులను పోర్టు సీఈవో జగదీష్ పటేల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై పోర్టు, లాజిస్టిక్స్ రంగం ప్రస్తుతం విస్తృతంగా అభివృద్ధి చెందుతూ ఉందన్నారు. ఈ నేపథ్యంలో యువత పోర్టు రంగంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, తద్వారా ఉజ్వల భవిష్యత్తును పొందాలన్నారు. పోర్టు సీవో జగదీష్ పటేల్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా యువత సమగ్ర అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో పోర్టు సీఈవో రాజన్‌బాబు, జీ వేణుగోపాల్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్డీసీ సీఈవో జితిన్

జగనన్న కాలనీల్లో అవినీతిపై విజిలెన్స్ విచారణ : సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం లోని జగనన్న కాలనీలో రూ.కోట్ల అవినీతి జరిగిందని, ఈ అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో బుధవారం వెంకటాచలంలోని జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా గిరిజనుల ఇళ్లను పరిశీలించారు. ఇళ్ల గోడలు వర్షానికి నాని పెచ్చులు ఊడిపోవడాన్ని గుర్తించారు. శ్లాబ్‌కు స్టీల్ సక్రమంగా వాడకపోవడనాన్ని సైతం గుర్తించిన ఆయన, పూర్తిగా పనులు నాసిరకంగానే జరిగాయన్నారు. అనంతరం మాట్లాడుతూ ఇళ్ల పునాదులు నిర్మించే సమయంలోనే భారీగా అవినీతి జరిగిందన్నారు. లెవలింగ్ పేరిట రూ.20లక్షలకుపైగా వైసీపీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన, టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, కుంకాల నాగేంద్రప్రసాద్, చల్లా నాగార్జున్ రెడ్డి, మునుస్వామి, రాఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.



చేతితో లాగితే ఇంటి గోడ పెచ్చులు ఊడిపోవడాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

● గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

వెంకటాచలం మండలం కొండ కింద ఉన్న గిరిజన కాలనీలో బుధవారం జోరు వానలోనూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్యటించారు. గిరిజనులను అప్యాయంగా పలకరించారు. అనంతరం దుప్పట్లు, ప్లాస్టిక్ పట్టాలు పంపిణీ చేశారు. అలాగే పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కాలనీ అంతా తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నెల్లూరు-విజయవాడ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నుంచి విజయవాడ రాకపోకలకు సూపర్‌లగ్జరీ సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ 1వ డిపో డీఎం మురళీ కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు నుంచి విజయవాడకు వెళ్లే సర్వీసుల్లో ఉదయం 4 గంటలకు 42309, 5 గంటలకు 42070, 7.30కు 42231, మధ్యాహ్నం 1.30కు 42250, సాయంత్రం 4 గంటలకు 42259, సాయంత్రం 4.30కు 42245 సర్వీసు నెంబర్లకు రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చే ప్రయాణికులు ఉదయం 11.30 గంటలకు 42310, మధ్యాహ్నం 12.30కు 42071, 3.30కు 42232, రాత్రి 9 గంటలకు 42251, రాత్రి 12.05కు 42269, రాత్రి 12.30కు 422 46 సర్వీసు నెంబర్ల బస్సుల్లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.



ఉదయగిరి : ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాలాజీనగర్ వాసులు

కొత్త దుకాణాలు
పాత ధరలు

● ప్రైవేటు మద్యం దుకాణాల ప్రారంభం

● పూర్తిస్థాయిలో అందని స్టాకు.. వందషాపులే ఆరంభం

● పాత బ్రాండ్లను చూసి అవాక్కయిన మందుబాబులు

● వారం రోజులపాటు తప్పదన్న ఎక్సైజ్ అధికారులు

● సాంకేతిక సమస్యలు పరిష్కారం తర్వాతే కొత్త బ్రాండ్లు



ఆత్మకూరులో ఓ దుకాణం ముందు మద్యం ప్రియులు

నెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా మందుబాబులు ఎదురుచూస్తున్న పాత మద్యం విధానం అమలులోకి వచ్చింది. బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రైవేటు మద్యం దుకాణా లు తెరుచుకున్నాయి. అయితే లైసెన్సుపరంగా కొన్ని సమస్యలు ఎదురవడంతో తొలిరోజు షాపుల ప్రారంభం ఆలస్యమైంది. బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతానికి జిల్లావ్యాప్తంగా 100 షాపులు ఓపెన్ అయ్యాయి. మిగిలిన 82 షాపులకు స్టాక్ విడుదల కాకపోవడంతో గురువారం తెరుచుకోనున్నాయి.

● పాత షాపులే

శాశ్వత లైసెన్సు ఇవ్వాలంటే చాలా తతంగం ఉంది. షాపు నిర్వహించే గది అద్దె ఒప్పందం, బ్లూప్రింట్ తదితరాలను ఎక్సైజ్ శాఖకు అందజేయాలి. ఇదంతా జరగాలంటే 15 రోజుల సమయం పడుతుంది. దీనివల్ల మద్యం వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారు. అందుకని తాత్కాలిక లైసెన్సులు ఇచ్చారు. మద్యం షాపులను కూడా పాత దుకాణాల్లోనే కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. అయితే పాత దుకాణాల్లో స్టాక్, ఫర్నిచర్ అలాగే ఉండటంతో వీటిని తరలించడానికి సాయంత్రం అయ్యింది. దీంతో తొలిరోజు దుకాణాల ఓపెనింగ్ ఆలస్యమైంది.

● పాత బ్రాండ్లే!

షాపులు, వాటి యాజమాన్యాలు కొత్తవి అయినా సరుకు, ధరలు మాత్రం పాతవే. కొంతకాలంపాటు మద్యంప్రియులు పాత బ్రాండ్లు, పాత ధరలతో సర్దుకోక తప్పదు. వైసీపీ ప్రభుత్వంలో పేరున్న బ్రాండ్ల మద్యం కొనుగోళ్లను పూర్తిగా ఆపేశారు. నాసిరకం బ్రాండ్లను మందుబాబులతో తాగించారు. వీటిని పక్కకు నెట్టేసి పేరున్న ప్రముఖ బ్రాండ్ల సరుకును ఎక్సైజ్ శాఖ కొనుగోలు చేయాలి. ఈ సరుకు మద్యం డిపోలకు చేరాలి. అక్కడి నుంచి ఇండెంట్ల వారీగా షాపులకు చేరాలి. ఈ ప్రక్రియ మొదలు కావడానికి 15 రోజుల సమయం పడుతుందని ఎక్సైజ్ శాఖ అంటోంది. అంతవరకు పాత బ్రాండ్లు, పాత ధరలతోనే సర్దుకోక తప్పని పరిస్థితి.

● కొనసాగిన నిరసన

కాగా, తమ ప్రాంతంలో మద్యం దుకాణాలు వద్దంటూ రెండవ రోజు బుధవారం కూడా జిల్లాలో అక్కడక్కడా నిరసనలు వ్యక్తం అయ్యాయి. బుచ్చిరెడ్డిపాళెం, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో స్థానికులు ఆందోళన చేశారు. చివరకు ఎక్సైజ్ అధికారులు వారికి సర్దిచెప్పారు.



నీటిపై అల్లుకున్న పచ్చదనం

సంగం పెన్నా పాత ఆనకట్ట రెగ్యులేటర్ల వద్ద గుర్రపు డెక్కతో పచ్చదనం అలుముకుంది. బ్యారేజీ ప్రారంభించిన తరువాత ఆనకట్ట వద్ద ఉన్న కనిగిరి రిజర్వాయర్, ఎడమకాలువ రెగ్యులేటర్లు పూర్తిగా మూసేశారు. వర్షాలకు బీరాపేరు, బొగ్గేరు వాగుల నుంచి వచ్చే వరద నీటిలో గుర్రపుడెక్క ఆకు కొట్టుకువచ్చి రెగ్యులేటర్ల వద్ద నిలిచిపోయింది. దీంతో రెగ్యులేటర్ల వద్ద పచ్చదనం సంతరించుకుంది.

- సంగం(ఆంధ్రజ్యోతి)

ఊటీని తలపించేలా..

జోరున వర్షం.. మేఘావృతమై ఉన్న ఆకాశాన్ని తాకుతున్నట్టుగా కనువిందు చేస్తున్న కొండలు.. పచ్చని చెట్లపై పరుచుకున్న మంచు దుప్పటి అబ్బో సోమశిల పరిసరాలు ఊటీ అందాలనే తలపిస్తున్నాయి. మొన్నటిదాకా భానుడి ప్రతాపానికి మాడిపోయిన చెట్లు చేమలు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిగురించాయి. ఆకులన్నీ పచ్చగా విచ్చుకోవడంతో కొంతంతా ఆకుపచ్చ రంగు వేసినట్టు కనిపిస్తూ చూపురులను ఆకట్టుకొంటున్నాయి.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)



ప్రమాదాలు జరగకూడదనీ...

నెల్లూరులోని మాగుంటలేఅవుట్‌లో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం అది. రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో పేరెన్నికగల హోటళ్ల సముదాయం ఎదురుగా నడి రోడ్డుపై ఏర్పడిన గుంతలో వర్షపునీరు చేరింది. ఇంకేముంది.. అటువైపు వెళుతున్న వాహనదారులు ఆ గుంతలో పడి ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు ఆ రోడ్డుపైనే వెళుతున్నా ఈ గుంత మాత్రం వారికి కనిపించలేదు. అయితే, సామాజిక స్పృహ కలిగిన ఓ వ్యక్తి గంత వద్దకు చేరుకుని సూచికలు ఏర్పాటు చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నడిరోడ్డుపై ఏర్పడిన ఈ గుంతను పూడ్చాలని నగరవాసులు కోరుతున్నారు.

- నెల్లూరు(సిటీ),(ఆంధ్రజ్యోతి)



నేర వార్తలు

బస్సును ఢీకొన్న ట్రక్కు ఆటో

● డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



మనుబోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొమ్మలపూడి క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు నుంచి గూడూరు వచ్చే మార్గంలో భారీ వాహనం మరమ్మతులకు గురికావడంతో ట్రాఫిక్‌ను ఒకే మార్గంలోకి మళ్ళించారు. ఈ క్రమంలో గూడూరు నుంచి 20మంది ప్రయాణికులతో నెల్లూరుకు ఆర్టీసీ బస్సు వెళుతుండగా, పలమనేరుకు చెందిన ట్రక్కు ఆటో బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కు ఆటోడ్రైవర్ శ్రీనాథ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు సాయంతో బయటకు తీశారు. చికిత్స నిమిత్తం డ్రైవర్‌ను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు

నెల్లూరు(లీగల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో పీ.నాగభూషణంకు 6 నెలలపాటు జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండోవ ఆదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎల్ శారదారెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని ఏసీ నగర్‌కు చెందిన ఫిర్యాది వీరేపల్లి పుల్లయ్య దగ్గర నాగభూషణం 2018 మార్చి 9న రూ.9.15 లక్షల అప్పుగా తీసుకుని ప్రాంసరీ నోట్ రాసి ఇచ్చాడు. సదరు అప్పు తీర్చేందుకు నాగభూషణం 2019 సెప్టెంబరు 4న చెక్కు ఇచ్చాడు. సదరు చెక్కును ఫిర్యాది పుల్లయ్య 2019 సెప్టెంబరు 5వ తేదీన బ్యాంకులో వేయగా అది చెల్లలేదు. దాంతో ఫిర్యాది 2019 సెప్టెంబరు 16వ తేదీన తన న్యాయవాది ద్వారా నాగభూషణంకు లీగల్ నోటీసులు ఇచ్చి కోర్టులో ప్రైవేటు కంప్లైంట్ దాఖలు చేశాడు. కేసు విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు నాగభూషణంకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. అదేవిధంగా పరిహారం కింద చెక్కు ఆమౌంట్ రూ.9.15 లక్షల ఫిర్యాదికి చెల్లించాలని, అలా చెల్లించకుంటే మరో 2 నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



గౌతమ్ (ఫైల్)

నెల్లూరు(క్రైం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫత్తేఖాన్‌పేట నకిలంవారి వీధి ప్రాంతంలో నివాసం ఉంటున్న చెన్నం కార్తీక్, సురేఖ దంపతుల కుమారుడు గౌతమ్ అదృశ్యంపై చిన్న బజారు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గౌతమ్‌కు పాఠశాలలో పెట్టిన పరీక్షలో మార్కులు తక్కువగా వచ్చాయని ఈనెల 12వ తేదీన తండ్రి మందలించాడు. అప్పటి నుంచి ఎవరితోనూ మాట్లాడకుండా ముభావంగా ఉంటూ 14వ తేదీ ఉదయం ఇంట్లో కనిపించకుండాపోయాడు. దీంతో బంధువులు, సన్నిహితులను తల్లిదండ్రులు విచారించగా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి సురేఖ బుధవారం చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో దొరికిన బంగారు ఆభరణాలు

● బాధితులకు అప్పగించిన మహిళ



పోలీసుల సమక్షంలో బంగారు ఆభరణాలతో యానాదమ్మ కుమార్తె శ్రీలత, బాధితురాలు

మర్రిపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుండి మర్రిపాడు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సులో దొరికిన 9తులాల బంగారు ఆభరణాలను నేరుగా తెచ్చి పోలీసులకు అప్పగించి యానాదమ్మ అనే మహిళ నిజాయితీ నిరూపించుకుంది. వివరాలిలా ఉన్నాయి. నంద్యాలకు చెందిన శైలజ అనే మహిళ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో బస్సు ఎక్కి బుధవారం తెల్లవారుజామున 4గంటలకు నంద్యాలలో తమ స్టేజీ రాగానే నిద్రమత్తులో కంగారుగా దిగేసింది. తన చేతిలో ఉన్న చిన్న హ్యాండ్‌బ్యాగ్ బస్సులో ఉండిపోయింది. కాగా వారి వెనక సీటులో ఉన్న యానాదమ్మ అనే మహిళ ఆ బ్యాగ్ తీసుకుంది. మర్రిపాడులో బస్సు దిగి ఆటోలో ఇంటికి వెళ్లాక బ్యాగ్‌ను తెరిచి యానాదమ్మ చూడగా అందులో సరుడు, హారం, ఉంగరాలు, చెవు చుట్లు, కాళ్ల పట్టీలు వంటి బంగారు ఆభరణాలు ఉన్నాయి. బ్యాగ్‌లో ఫోన్ నెంబర్లు ఉన్న కాగితం కనిపించింది. అందులోని నెంబర్లకు ఫోన్‌చేసి సదరు వస్తువులు తమ దగ్గర ఉన్నాయంటూ సమాచారం ఇచ్చి యానాదమ్మ కుమార్తె శ్రీలత ద్వారా మర్రిపాడు స్టేషన్‌కు పంపి పోలీసుల సమక్షంలో సంబధిత వస్తువులను వారికి అప్పగించింది. యానాదమ్మ స్వగ్రామం మర్రిపాడు మండలం ఇర్లపాడులో ఉన్న తమ కుమార్తె వద్దకు వస్తుండగా ఈ ఘటన జరిగింది.

అప్రమత్తంగా ఉండండి

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



నెల్లూరు(జడ్పీ), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావం జిల్లాలో ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఆదేశించారు. బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన విద్యుత్ భవన్‌లో జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాను వల్ల ఎలాంటి ఇబ్బందులు జరిగినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు 24 గంటలు పనిచేసేలా చూడాలన్నారు. సూళ్లూరుపేట వద్ద వాయుగుండం తీరందాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. స్తంభాలు, పరికరాలు, అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువ మంది సిబ్బందిని నియమించామన్నారు. అధికారులందరినీ హెడ్ క్వార్టర్‌లోనే ఉంచి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలచంద్ర, సోమశేఖరరెడ్డి, శ్రీధర్, పరంధామయ్య పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7383
వెండి కిలో ధర	రూ. 94,200
వెండి ఒక గ్రాము	రూ. 97.20

ట్రామా కేర్ లేదు

జిల్లాలో ట్రామా కేర్‌కు అందుతున్న వైద్యచికిత్సలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రతిరోజూ జిల్లాలో ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా సరిహద్దుల్లో జాతీయ రహదారి విస్తరించి ఉండటంతో ఈ ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. దీంతోపాటు అత్యవసర రోగులు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తుంటారు. వీరికి ట్రామా కేర్ (ప్రమాదాలలో గాయాలు, ప్రకృతి విపత్తులు) వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అత్యవసర వైద్యంపై అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ అక్టోబరు 17న (నేడు) వరల్డ్ ట్రామా డేగా జరుపుకోవాలని తీర్మానించింది. ఇందుకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చింది.



నేడు వరల్డ్ ట్రామా డే

● ఏటేటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ● అధికమవుతున్న మృతుల సంఖ్య

● ప్రభుత్వాసుపత్రుల్లోనే నిపుణుల కొరత ● అత్యవసర వైద్యంలోనూ ఎన్నో బాలారిష్టాలు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరుల్లో ఏరియా ఆసుపత్రులు, 10 సీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో ట్రామాకేర్ చికిత్సలు అందని ద్రాక్షలా మిగిలాయి. 2013లో వైద్య విధాన పరిషత్‌లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా జనరల్ ఆసుపత్రి ఉన్నా, ఇక్కడ కూడా అత్యవసర వైద్యానికి ఆటంకాలు తప్పటం లేదు. 2010లోనే జీజీహెచ్‌లో ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభించినా లక్ష్యాలు మాత్రం నెరవేరలేదు. గత ఏడాదిగా ట్రామాకేర్ సెంటర్ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ట్రామాకేర్ సెంటర్‌ను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి స్వాధీనం చేసింది.

● వెంటాడుతున్న సిబ్బంది కొరత

ఈ కేంద్రంలో 57 మంది వైద్యులు, సిబ్బంది ఉండాల్సి ఉండగా, 14 మంది స్టాఫ్‌నర్సులు, నలుగురేసి చొప్పున ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు ఉన్నారు. వీరు కూడా జీజీహెచ్ పరిధిలోని క్యాజువాలిటీలోనే పనిచేస్తున్నారు. దీంతో ట్రామాకేర్ యూనిట్‌లో పూర్తిగా వైద్య సేవలు నిలిచిపోయాయి. ఇక ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితోపాటు కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులలోనూ ట్రామాకేర్ సెంటర్‌లు లేకపోవటంతో అత్యవసర వైద్య సేవలకు తీరని విఘాతం కలుగుతోంది.

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020-21	943	398	944
2021-22	997	466	1006
2022-23	883	494	1088
2023-24	745	354	978

● వైద్య నిపుణులు ఏరీ ?

ప్రతిఏటా జిల్లాలో 900కిపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో 350 మందికిపైగా మృత్యువాత పడుతున్నారు. 950 మంది వరకు క్షతగాత్రులవుతున్నారు. అత్యవసర పరిస్థితిలో వచ్చే రోగుల్లో 24శాతం మంది ప్రమాద బాధితులేనని వైద్యులు చెబుతున్నారు. ఇందులో కూడా 15 నుంచి 35 ఏళ్లలోపు ఉన్న వారే ఎక్కువగా ఉన్నారు. ప్రమాద బాధితులకు గంటలోపు ఆసుపత్రికి తీసుకురావాల్సి ఉంది. దీన్ని గోల్డన్ అవర్‌గా వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి ప్రమాద బాధితులకు ఎక్కువగా తలకు తీవ్ర గాయాలు అవుతుంటాయి. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాల్సి ఉంది. అక్కడి వైద్యుల సూచనల మేరకు బాధితులను ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన వెంటనే క్రిటికల్‌కేర్ వైద్యులతోపాటు న్యూరోసర్జన్, ఆర్థోపెడిక్, రేడియాలజీ వైద్యనిపుణులు బాధితులను పరీక్షించాల్సి ఉంటుంది. కొన్ని కేసుల్లో గుండె వైద్య నిపుణుల అవసరం కూడా ఉంటుంది. అయితే నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలతోపాటు జిల్లాలోని ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఆర్థోపెడిక్, న్యూరాలజీ సర్జన్లు తప్ప మిగిలిన స్పెషాలిటీ వైద్య నిపుణులు లేరు. ఈ క్రమంలో మృతుల సంఖ్య పెరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ట్రామాకేర్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.

● వైద్యచికిత్సలు అందిస్తున్నాం



ప్రస్తుతం ట్రామాకేర్ విభాగానికి తక్కువ కేసులు వస్తున్నాయి. జీజీహెచ్‌లోనే ట్రామాకేర్ వైద్య సేవలు అందిస్తున్నాం. జిల్లాలో రోడ్డు ప్రమా దాలు జనవరి నుంచి ఇప్పటి వరకు వందల సంఖ్యలో జరిగాయని ఇటీవల జిల్లా సమీక్షలో అధికారులు వెల్లడించారు. బాధితులందరికీ మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా కృషి చేస్తున్నాం. ట్రామాకేర్ విభాగాన్ని మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ కిరణ్‌కుమార్, ట్రామాకేర్ నోడల్ అధికారి

● ఎక్కువగా ట్రామా కేసులు వస్తుంటాయి



నారాయణ ఆసుపత్రికి ఎక్కువగా ట్రామా కేసులు వస్తుంటాయి. జిల్లాలో ట్రామా రోగులు ఎక్కువ య్యారు. వారి అవసరాలను గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

- డాక్టర్ స్కంధ గోపాలకృష్ణ, ఎమర్జెన్సీ మెడిసిన్, నారాయణ ఆసుపత్రి

ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

నెల్లూరు(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వ ఐటీఐలు, డిఎల్‌టీసీ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో బుధవారం జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడుగా బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కే.శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శిగా కె.ఏడుకొండలు, కోశాధికారిగా ఏవీఎస్.శారద, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె.గౌస్‌బాషా, ఎన్.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.దేవదానం, జీవీఎస్.వరప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా డి.శ్రీనివాసాచారి, ఎల్.రామారావు, రామ్మోహన్, టీ.రామలింగం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లాలో ఐటీఐల ఉన్నతికి పాటుపడడంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు, వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. తామంతా ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్న నమ్మకంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య అధికారులు ఆర్.శ్యాం ప్రసాద్, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గానికి ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు

నేడు కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్ణయించిందని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో వాల్మీకి జయంతిని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వాల్మీకి బోయ కుల నాయకులు, పెద్దలు, బీసీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

బాబూ.. ఏది జాబు ?

నెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాలనాపరంగా సంస్కరణలు తీసుకువచ్చామని, సచివాలయ వ్యవస్థను స్థాపించామని గత వైసీపీ గొప్పలు చెప్పుకుందేకానీ, ఆ వ్యవస్థ నిర్వహణను పూర్తిగా రాజకీయ మయం చేసింది. ఆ కారణంగానే ఈ రోజు జిల్లా పరిధిలో వేలాదిమంది వలంటీర్లకు ఉన్న కాస్త ఉపాధి మార్గం కూడా మూసుకుపోయింది. సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాల మాట ఎలా ఉన్నా, గత వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా ఆ పార్టీ కార్యాలయాలుగా మార్చేసింది. వలంటీర్ల నియామకాలకు జరిగిన ఇంటర్వ్యూలు పూర్తిగా మొక్కుబడిగా సాగాయి. ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరిని సిఫార్సు చేశారో వారినే వలంటీర్లుగా నియమించారు. ఉద్యోగం ఇప్పించింది మేమే కదా, మేము చెప్పినట్టు వినండని మెడలు వంచి వారితో పనిచేయించారు. దీంతో వలంటీర్ల సేవలకు రాజకీయ వాసన పట్టుకుంది. ఎన్నికల సందర్భంగా వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్ల జాబితాలో ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరుల ఓట్లు ఏరివేయడానికి ప్రయత్నించారు. వీటన్నింటిపై పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తడంతో ఎన్నికల కమిషన్ ఏకంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు వలంటీర్ల సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. అక్కడికి ఆగి ఉన్నా పరిస్థితి మరోలా ఉండేదేమో....? ఎన్నికల కమిషన్ తాత్కాలికంగా పక్కనపెడితే, వైసీపీ నాయకులు మళ్లీ తిరిగి అధికారంలోకి వస్తామనే విపరీతమైన నమ్మకంతో ఏకంగా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించారు. పార్టీ ప్రచారాలకు వాడుకున్నారు.

● వలంటీర్ల పునర్నియామకం ఎప్పటికో!?

● అధికారంలోకి రాగానే రూ.10వేల జీతం ఇస్తామని హామీ


● 4 నెలలు గడుస్తున్నా కొలువులపై లేని స్పష్టత

● ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ నిరుద్యోగుల ప్రదక్షిణ

● ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు

● మానవతా దృష్టితో బాబు హామీ

ఈదశలోనే చంద్రబాబు వలంటీర్లకు హామీ ఇచ్చారు. వైసీపీ ఒత్తిళ్లకు భయపడొద్దు. ఎవరూ రాజీనామా చేయవద్దు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెట్టింపు జీతం (నెలకు రూ.10) ఇస్తాం, సమాజంలో వలంటీర్లకు గౌరవం పెరిగేలా పని విధానాన్ని రూపొందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే వలంటీర్ల ద్వారా రాజీనామాలు చేయిస్తే ప్రజల్లో వైసీపీ పట్ల పాజిటివ్ ట్రెండ్ వస్తుందనే కుట్రతో ఆ పార్టీ నాయకులు వారి చేత బలవంతంగా రాజీనామా చేయించారు. పార్టీ జెండాను చేతపట్టించి జై కొట్టించుకున్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : తిరిగి తమను వలంటీరుగా నియమించాలని ఆందోళన చేస్తున్న యువత (ఫైల్)

● బలయింది చిరుద్యోగులే..

జిల్లాలో 13,609 వలంటీర్లు పనిచేసేవారు. ఇప్పుడు వీరందరి ఉపాధి మార్గం మూసుకుపోయింది. రాజీనామాలు చేయకుండా, వైసీపీ నేతల ఒత్తిడి లెక్కచేయకుండా మౌనంగా ఉండిపోయి ఉంటే, ఎన్నికల ఫలితాల తరువాత యథావిధిగా వారి ఉద్యోగాలు కొనసాగి ఉండేవేమో...? వైసీపీ అనుకూలంగా రాజీనామా చేసిన వారు ఇప్పుడు ఎటూ కాకుండా పోయారు. తమ వలంటరీ పోస్టులు తిరిగి ఇప్పించమని టీడీపీ నాయకుల వద్దకు వెళితే...ఆ రోజు మాకు వ్యతిరేకంగా రాజీనామా చేశారు..? ఇప్పుడు మీకు ఎలా సిఫార్సు చేయమంటారు..? అనే ప్రశ్నలు వారికి ఎదురవుతున్నాయి. ఏకంగా వలంటీర్ల వ్యవస్థలోనే ప్రతిష్టంభన నెల కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు వలంటీర్ల పునర్నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వాస్తవానికి ప్రభుత్వానికి ఆ పరిస్థితి కూడా లేదు. విజయవాడ వరదల కారణంగా దాదాపు పనులన్నీ ఆగిపోయాయి. అన్ని సర్దుబాటు జరిగితే.. వలంటీర్ల వ్యవస్థపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అప్పటి వరకు నిరుద్యోగులు ఎదురుచూడక తప్పదు.

న్యూస్ బాక్స్

డీఎస్పీ సోమశిల సందర్శన



అనంతసాగరం: జలాశయం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ

అనంతసాగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయాన్ని ఆత్మకూరు డీఎస్పి వేణుగోపాల్ బుధవారం సందర్శించారు. డ్యాంకు వస్తున్న వరద ప్రవాహం వివరాలను సిబ్బందిని అడిగి తెలుకున్నారు. అనంతరం కమ్మవారిపల్లి వద్ద సోమశిల ప్రధాన రోడ్డును వాగును పరిశీలించారు. అయన వెంట ఎస్ఐ అనుషా ఉన్నారు.

● కలువాయి (ఆంధ్రజ్యోతి): బుధవారం సాయంత్రం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ మండలంలో పర్యటించారు. వాగులు, వంకలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ సుమన్ ఉన్నారు.



కావలి: తుమ్మలపెంట రోడ్డు డైవర్షన్‌లో డీఎస్పీ, సీఐ

● కావలి, (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ శ్రీధర్, రూరల్ సీఐ రాజేశ్వరరావులు తుమ్మల పెంట రోడ్డు, చెన్నాయపాలెం రోడ్డులోని చప్టాలు, వాగులను పరిశీలించారు. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించవద్దని హెచ్చరిస్తూ దారికి అడ్డుగా ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. అనంతరం కావలి తహసీల్దార్ శ్రావణ్, మండల ప్రత్యేకాధికారులు పీఆర్ఏఈ సుబ్రహ్మణ్యం, వీఆర్వో బాలయ్యలు ఆ ప్రాంతాలను పరిశీలించారు.

ఆముదాలదిన్నె ఎస్టీ కాలనీ వాసుల తరలింపు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలం ఆముదాలదిన్నె ఎస్టీకాలనీలోని గిరిజనులను బుధవారం మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు తరలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు శ్రావణ్ కుమార్, ఎమ్పీడీవో శ్రీదేవిలు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో బాలకోటయ్య, కుట్టుబోయిన శేషసాయి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల పరిశీలన

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభా వంతో వర్షాలు కురుస్తున్నందున బుధవారం తహసీల్దారు నాగరాజు తన సిబ్బందితో కలిసి నీటి వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముత్తరాశిపల్లి వాగును తనిఖీ చేశారు. అనంతరం దుత్తలూరు కొండమీద గల ఎస్టీ కాలనీని సందర్శించి వర్షాలు కురుస్తున్నందున కాలనీ వాసులు జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు అధికమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని భరోసా ఇచ్చారు.



ఎస్టీ కాలనీ వాసులకు సూచనలిస్తున్న తహసీల్దారు నాగరాజు

పొంగుతున్న వాగులు, వంకలు

● అప్రమత్తమైన అధికారులు ● పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు



చేజర్ల: నల్లవాగును పరిశీలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్, ఎస్ఐ ప్రభాకర్



ఉదయగిరిలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

కందుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లో 100 మిల్లీమీటర్లపైనే వర్షపాతం నమోదు అయింది. ఉప్పుటేరు, ఎలికేరు ఉధృతంగా పారుతూ మన్నేరుకు వరద చేరుతోంది. రాళ్లపాడు ప్రాజెక్టు నీరు దిగువకు వదిలితే ఉలవపాడు, లింగసముద్రం, గుడ్లూరు మండలాలోని పలు చెరువులు పూర్తి సామర్థ్యంతో నిండుతాయి. కొండముడుసు పాలెం ఎర్రవాగు ప్రవాహంతో ఆర్టీసీ రాకపోకలు ఆగిపోయాయి. ఉప్పుటేరు ఉధృతంగా పారుతుండటంతో పట్టణంలోని ఆదిఆంధ్ర కాలనీ, దివివారిపాలెం, కాకుమానివారిపాలెం, లక్ష్మీనరసింహస్వామి ఎస్టీ కాలనీ ప్రాంతాల ప్రజలు కందుకూరు టౌన్‌కు రాకపోకలు నిలిచిపోయాయి.

● చేజర్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందలవాగు, నల్లవాగు పొంగి పొర్లుతున్నాయి. గొల్లపల్లి సమీపంలోని పందలవాగు పొంగి ప్రవహిస్తుండడంతో చేజర్ల ఎస్ఐ ప్రభాకర్ రాకపోకలు నిషేధించారు. అదేవిధంగా చేజర్ల కండ్రిక గ్రామంలో గంగవరపు పద్మమ్మకు చెందిన ఇంటి ప్రహరీ కూలిపోయింది. తిరపతినాయుడు పల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలో వరద నీరు చేరడంతో విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ తహసీల్దారు మస్తానయ్య పరిశీలించి ఎక్స్‌కవేటర్ సహాయంతో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. చలపనాయుడుపల్లి వద్ద లోతట్టు ప్రాంత ప్రజలతో ఆత్మకూరు ఆర్డీవో పావని మాట్లాడారు. అనంతరం చలపనాయుడు పల్లి, టి.కే.పాడు గ్రామాలలో పునరావాస కేంద్రాలను పరిశీలించి అన్ని వసతులు కల్పించాలని తహసీల్దారును ఆదేశించారు. టికే పాడు సమీపంలోని ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగును డీఎస్పి కే వేణుగోపాల్, ఇన్‌చార్జ్ తహసీల్దారు మస్తానయ్య పరిశీలించారు. మండలంలో 70 హెక్టార్లలో వరిపైరు నేల వాలిందని, నెల్లూరుకు చెందిన శాస్త్రవేత్తలు వరిపైరును పరిశీలించనున్నట్లు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

● ఆత్మకూరు: బుధవారం ఉదయం నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలను కొనసాగించారు. లోతట్టు ప్రాంతాలు, పెన్నా నది పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆర్డీవో బి పావని, డీఎస్పీ కె వేణుగోపాల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను సందర్శించి అక్కడ రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చేజర్ల, అనంతసాగరం మండలంలోని పడమటికంభంపాడులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు. పునరావాసకేంద్రాల్లో గర్భిణులను ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వ వైద్యశాలలో చేర్చాలని అధికారులకు సూచించారు. ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు స్థానిక ఇరిగేషన్ అధికారులతో కలిసి నియోజక వర్గంలోని పలు చెరువులను, సప్లయ్ చానల్స్‌ను పరిశీలించి అవసరమైన ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

స్తంభించిన జనజీవనం...

● ఉదయగిరి రూరల్: తుపాన్ ప్రభావంతో మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో బుధవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. వర్షపు నీటితో మురుగు కాలువలు పొంగిపొర్లడంతో రహదారులు చెత్తాచెదారంతో నిండాయి. రహదారులపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మండలంలోని గుడినరవ ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి వద్ద చెట్టు నేలకొరగడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు కొద్దిమేర ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలకు గండిపాళెం జలాశయానికి 2 అడుగుల మేర నీరు చేరినట్లు జలవనరుల శాఖాధికారులు తెలుపుతున్నారు. కాగా, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వరి పంటలో నీరు నిల్వ లేకుండా రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గండిపాళెం, గుడినరవ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి రైతుసేవా కేంద్రాల్లో రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

● వరికుంటపాడు: అల్పపీడన ప్రభావంతో రోజుల తరబడి కురుస్తున్న వర్షాల తాకిడికి మండలంలోని వాగులు, వంకల్లోకి వరద నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం సైతం జడివాన కమ్ముకోవడంతో నక్కలగండి పరిధిలోని ఉప్పువాగు, కనియంపాడు- రామదేవులపాడు గ్రామాల సమీపంలోని పిల్లాపేరు, కాంచెరువు సమీపంలోని ఉప్పు వాగుల ఉధృతికి వంతెనలపై నీరు ప్రవహిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే రిజర్వాయర్లు, చెరువుల్లోకి ఆశించిన మేర నీరు చేరడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు దున్ని పంటలు సాగు చేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా మారాయంటూ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా నివాసాల నుంచి బయటకు వచ్చే పరిస్థితులు లేకపోగా చలిగాలులు పెరుగుతుండడంతో ప్రజలతో పాటు పిల్లలు, వృద్ధులు బెంబేలెత్తిపోతున్నారు.

వరికి తీవ్ర నష్టం

● అనంతసాగరం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో సోమశిల, కొత్తపల్లి, వడ్డిపాలెం, అనంతసాగరం తదితర గ్రామాల్లో చేతికందిన వరి దెబ్బతింది. మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి మునిగిన వరి పొలాలు పరిశీలించారు. 350 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. కమ్మవారి పల్లి, పాతదేవరాయపల్లి వద్ద పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. సోమశిల సమీపంలో పీకేపాడు చెరువు అలుగు ద్వారా వస్తున్న నీటి ప్రవాహంతో కమ్మవారిపల్లి వద్ద వాగు పొంగిపొర్లుతోంది. సోమశిల, అనంతసాగరం రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. పడమటికంబంపాడు ఎస్సీకాలనీ వాగులు ముంపునకు గురికావడంతో కొన్ని కుటుంబాలను ప్రాథమిక పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి వారికి ఆహార పదార్థాలు అందిస్తున్నారు. ఆ కేంద్రాన్ని ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దారు వీరవసంతరావు పరిశీలించారు.

నిండుకుండలా చినక్రాక రిజర్వాయరు

● జలదంకి: తుఫాను ప్రభావంతో మండలంలో మూడురోజులుగా భారీ వర్షాలు పడుతుండటంతో వాగులు, వంకలు పొంగాయి. సాగునీటి చెరువులతో సహా చినక్రాక రిజర్వాయరు నిండుకుండలా మారింది. ఈ పరిస్థితిని చూసి మండల రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిప్పలేరు, చీకటివాగు, కమ్మవారిపాలెం, చామదల, గోపన్నపాలెం వాగులు పొంగడంతో రోడ్లపై ఉన్న కల్వర్టులపైన నీరు పారుతుండడంతో రాకపోకలు స్తంభించి పోయాయి. చినక్రాక, అన్నవరం గోపన్నపాలెం, కమ్మవారిపాలెం, చామదల తదితర గ్రామాల ప్రజలు మండలకేంద్రానికి, కావలికి వెళ్లే వీలులేక ఇళ్లకే పరిమితం అయ్యారు. జలదంకి, కేశవరంలోని లోతట్టుప్రాంతాల వారిని తహసీల్దారు ప్రమీల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. వాగులు దాటకుండా ఎస్ఐ లతీఫున్నీసా తమ సిబ్బందిని వాగుల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జలదంకి- జమ్మలపాలెం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్‌స్తంభం ఒరిగింది. జలదంలోని చల్లాయానాదులను పునరావాస కేంద్రాలకు తరలించాలని సీపీఎం నేతలు రావి మాల్యాద్రి, మేలంగి ఆంథోనీబాబులు బుధవారం డీటీ జూలీభాయ్‌కి వినతిపత్రం అందజేశారు.

వర్షంతో రోడ్లన్నీ జలమయం

● అల్లూరు : అల్లూరులో రోడ్లు జలమయమయ్యాయి. ఇప్పటికే ధ్వంసమైన రోడ్లలో మోకాటి లోతు గుంటల్లో నీరు నిలువడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లూరు చెరువుకు పైడేరు నుండి ఏటీఎస్ ఛానల్ నుండి వరదనీరు ఉధృతంగా వస్తుంది. ఈ నీటిలో చేపలు పట్టేందుకు గిరిజనులు బారులు తీరారు. ఇస్కపల్లి తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలోకి ఎవ్వరినీ వెళ్లనీయకుండా ముందస్తు సూచనలు చేశారు. దీంతో మత్స్యకారులు తమ బోట్లు, వలలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో తహసీల్దారు పర్యటన: తుఫాను ధాటికి ప్రమాద ప్రాంతాలైన పురిణి పంచాయతీలోని కొన్ని ప్రాంతాలను తహసీల్దారు లక్ష్మీ నారాయణ పరిశీలించారు. పురిణి తుఫాన్ నగర్ వద్ద పైడేరు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఏదైనా ప్రమాదం వాటిల్లితే వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. లస్కర్లు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు.

● లింగసముద్రం: అన్నెబోయినపల్లి ప్రధాన రహదారిపై అడుగులోతులో వర్షపునీరు నిలిచి పోయింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మార్జిన్లపై ఎత్తుగా మట్టి పోయడంతో ఈ సమస్య నెలకొంది. అలాగే గ్రామంలో సైడు కాలువలు లేక పోవడంతో రోడ్డుపైనే నీరు పారుతోంది. కాలువ పూడిక తీయించి నీరు బయటకు పంపేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక యూపీ పాఠశాలలో మోకాటి లోతులో వర్షపు నీరు నిలిచిపోయింది. పెదపవని సమీపంలోని ఉప్పుటేరులో బ్రిడ్జిని ఆనుకొని నీరు ప్రవహిస్తోంది. రీసర్వే డీటీ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసులు వీఆర్ఓ, కార్యదర్శులను ప్రజలను అప్రమత్తం చేశారు.

114 మి.మీ వర్షపాతం నమోదు

● కొండాపురం : మండలంలో రెండురోజులుగా కురిసిన వర్షం 114 మిల్లీమీటర్లుగా నమోదు అయ్యింది. అన్ని గ్రామాల అంతర్గతరోడ్లన్నీ బురదమయంగా మారాయి. సత్యవోలు పంచాయతీ సత్యవోలు-అగ్రహారం మధ్య ఉన్న మిడతవాగు పొంగి బ్రిడ్జిపై నుండి నీరు పారుతోంది. ఎస్ఐ ఎమ్.వెంకటరావు సిబ్బందిని కాపలాగా ఉంచారు. గానుగపెంట పంచాయతీ అరుంధతీయవాడలో తాడిపర్తి దత్తాత్రమ్మకు చెందిన ఇంటి మట్టిగోడ కూలింది. ప్రజలకు సమస్యలు తలెత్తినట్లయితే సెల్:91775 04911ను సంప్రదించాలని తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● సీతారామపురం : అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీతారామపురం గ్రామ పంచాయతీలోని పడమటివీధి వైపున ప్రవహిస్తున్న గుంటమడుగు వాగును బుధవారం స్థానిక ఎంపీడీవో ఎం భాస్కర్, ఈవోపీఆర్డీ భార్గవి పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



అనంతసాగరం- వడ్డిపాలెం వద్ద దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు



లింగసముద్రం: చామదల నేరెళ్లవాగును పరిశీలిస్తున్న ఎస్ఐ లతీఫున్నీసా

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



కావలి: అన్నపుగుంట బ్రిడ్జి వద్ద వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కావలి, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 16: వరద ప్రభావిత ప్రాంతాలు అన్నపుగుంట ముంపు ప్రాంతం, బీకేనగర్, మద్దూరుపాడులోని టిడ్కో గృహాల ప్రాంతాలను బుధవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. దశాబ్దకాలంగా పాలకుల నిర్లక్ష్యానికి గురైన కావలి ప్రజల కష్టాలు తీర్చేందుకు నేనున్నానని ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. అలాగే బీకే నగర్ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ పునరావాసకేంద్రంలో ఉన్న వారి సమస్యలు తెలుసుకుని వారికి ఆహారం పంపిణీ చేశారు. మద్దూరుపాడులోని టిడ్కో గృహాల వద్ద ఉన్న వర్షపు నీటిని పరిశీలించి అక్కడ నీటిని మోటార్లు పెట్టి బయటకు పంపాలని అధికారులకు చెప్పారు. ముసునూరు గిరిజనకాలనీలో చేరిన వర్షపునీటినిబయటకు పంపేందుకు చేస్తున్న సహాయక చర్యలను ఆయన పరిశీలించారు. అనంతరం వరదలతో ప్రజలను కాపాడేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి ఆర్డీవో కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీట మునిగిన ప్రాంతాలను గుర్తించి నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు ఎక్స్‌కవేటర్‌లతో కాలువలు తీయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, కావలి తహసీల్దార్, శ్రావణ్ ఇతర అధికారులు ఉన్నారు.

రాళ్లపాడు వద్ద అప్రమత్తంగా ఉండండి



ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 16: రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం 6గంటల సమయంలో ఆమె రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించి మాట్లాడారు. ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించి నీటి విడుదల వివరాలను ప్రాజెక్టు ఏఈ చంద్రమౌలిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న 12.2అడుగుల నుంచి 14, 15 అడుగుల నీరు దాటితే తనకు సమాచారం ఇవ్వాలని, మన్నేరు పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఏఈ మనోహర్, నేతలు మాజీ సర్పంచు కిలారి కొండయ్య, మద్దెల రామారావు, అడపా రంగయ్య పాల్గొన్నారు.

కాలనీవాసులకు పునరావాస చర్యలు

కలిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, పోలీసు యంత్రాంగం, మండలంలోని పలు గ్రామాల వద్ద ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. తహసీల్దారు చొప్ప రవీంద్రబాబు, వెంకన్నపాలెం ఎస్టీ కాలనీలోని 19కుటుంబాలకు చెందిన 91 మందికి పునరావాసం కల్పించారు. వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ ఉమాశంకర్ కలిగిరి-కొండాపురం మార్గంలో బ్రిడ్జి నిర్మాణాల వద్ద పేరుకపోయిన చెత్త చెదారాలను జేసీబీ యంత్రాలతో తొలగింపజేశారు. వాగులవద్ద ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.

నేతల చొరవతో వరద నీరు తొలగింపు

బిట్రగుంట (ఆంధ్రజ్యోతి): ముంగమూరు పంచాయతీ పొల్లాలోకి బుధవారం వరద నీటి ప్రవాహం పెరిగింది. గ్రామ సమీపంలోని వంతెన తూములకు అడ్డుగా ఉన్న కంపచెట్లు, ముళ్ల తుప్పలలను సర్పంచు రాయి సుప్రజ సూచనల మేరకు ఉపసర్పంచు వినోద్‌యాదవ్, టీడీపీ నేత యన్నాబత్తిన వేంకటేశ్వర్లు రెండు ఎక్స్‌కవేటర్‌ను రప్పించి ముళ్లకంప తొలగించి నీరు వెళ్లేలా చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ జితేంద్రరెడ్డి, వీఆర్వో మాల్యాద్రి, కార్యదర్శి పద్మజ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

● తీరప్రాంతం గ్రామం పరిశీలన

సముద్రతీర ప్రాంతం జువ్వలదిన్నెలో బుధవారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పర్యటించి పొట్టిశ్రీరాములు స్మారక పర్యాటక కేంద్ర భవనాన్ని పరిశీలించారు. భవన ప్రాంగణంలో పెరిగిన ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు చేపట్టాలని కార్యదర్శి శ్రీనివాసులుకు సూచించారు. ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్న పడవలను తహసీల్దారు సురేష్‌బాబు, ఆర్ఐ వాజీద్, వీఆర్వోలతో కలిసి సందర్శించారు. కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్ఐ బోజ్య జడగోగుల, ఏనుగులబావి మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద ఇరుకుపోయిన ముళ్లకంపను సాయంత్రం తొలగింపు చర్యలు తీసుకున్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన




బిట్రగుంట, అక్టోబరు 16: బోగోలు మండలం చెంచులక్ష్మీపురం సీతాలక్ష్మణాంజనేయ సమేత కోదండరామ స్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపంలో నవగ్రహాల ప్రతిష్ఠ చేపట్టారు. వరహాచలం సాయిరామాచార్యులు, గుడ్లూరు వినోద్‌కుమార్ ఆచార్యుల బృందం శాస్త్రోక్తంగా ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ధ్వజస్తంభ దాతలు పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ, సిద్దయ్య, ఆదిశేషమ్మ దంపతులు, ఆలయ కార్యనిర్వాహణ సభ్యులు పసుపులేటి వేంకటేశ్వర్లు, తిరుపతమ్మ, వంశీకృష్ణ, ప్రియ దంపతులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ'తో గ్రామాలకు మహర్దశ

● జోరువానలోనూ కార్యక్రమం నిర్వహణ

● వింజమూరులో రూ. 2.86కోట్లతో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన




శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలకు మహర్దశ పడుతుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం కాటేపల్లి, రావిపాడు, బీసీ కాలనీ, ఎస్టీకాలనీ, నందిగుంట గ్రామాలలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులను పర్యవేక్షించాలని ఇరిగేషన్‌శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, కంభం అనసూయమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ దంతులూరి వెంకటేశ్వరరావు, ఇతర శాఖాధికారులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల తాకిడికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రఘునాథ్ అన్నారు. బుధవారం నక్కలగండి ఉప్పువాగుతో పాటు కనియంపాడు, తూర్పుబోయమడుగుల గ్రామాల సమీపంలోని పిల్లాపేరు, తూర్పురొంపిదొడ్ల, కాంచెరువు గ్రామాల సమీపంలోని ఉప్పువాగు వంతెనలను ఆయన పరిశీలించారు. ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బందితో కలిసి పహారా చేపట్టారు.

మద్యం దుకాణాల ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



ఉదయగిరి రూరల్ : సీఐకి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటును స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. లాటరీలో మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తులు ఆనకట్ట సమీపంలోని దుకాణం ఏర్పాటు చేసేందుకు అద్దెకు ఓ గదిని తీసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు దుకాణం ఏర్పాటును అడ్డుకున్నారు. దీంతో గదిని అద్దెకు ఇచ్చిన యజమానురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐలు ఇంద్రసేనా రెడ్డి, శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. దుకాణం ఏర్పాటుపై ఎక్సైజ్ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

●యూనియన్ రోడ్డులో ఆందోళన: తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని బుధవారం యూనియన్ రోడ్డు ప్రాంత వాసులు ఆందోళన చేపట్టారు. మద్యం దుకాణం ఏర్పా టుచేసేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో సమాచారం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకొని ఆందోళన చేశారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణం ఏర్పాటుచేసే సమీపంలో మసీదు, మదరసాలు ఉన్నాయన్నారు. నివాసాల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటుచేస్తే పలు ఇబ్బందులు తలెత్తుతాయని, అధికారులు స్పందించి పట్టణ శివారు ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని వారు కోరారు.

బాలాజీనగర్‌లో ఆందోళన

స్థానిక బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని బుధవారం రాత్రి ఆ ప్రాంత వాసులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నినాదాలతో కూడిన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మద్యం దుకాణం ఏర్పాటు చేసిన సమీపంలో వైద్యశాలలు, పాఠశాలలు ఉన్నాయని, నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సబబుకాదన్నారు. అనంతరం సీఐ లక్ష్మణ్‌స్వామికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన పరిశీలించి చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గడ్డం శ్రీనివాసులనాయుడు, సుధాకర్, కరీం, ఇలియాజ్, అనిల్, బాబుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గదుల్లేక ఇబ్బందులు

లాటరీలో మద్యం దుకాణం వచ్చిందని సంతోషించాలో.. గదులు అద్దెకు దొరక్కపోవడంతో బాధపడాలో తెలియని పరిస్థితి మద్యం దుకాణదారులిది. మంగళవారం రాత్రి 9 గంటలకు ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళం వేశారు. బుధవారం ఉదయం 10 గటలకు ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోవాల్సి ఉంది. అధికారులు దుకాణాలు కేటాయించిన వ్యాపారస్తులకు లైసెన్సులు జారీ చేయడంతోపాటు గోదాముల నుంచి మద్యం సరఫరా చేసేలా చర్యలు సైతం చేపట్టారు. అయితే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేవారికి అద్దెకు గదులు దొరకడం కష్టంగా మారింది. ఒకవేళ దుకాణం అద్దెకు దొరికినా స్థానికులు తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఆందోళనలు చేపట్టడంతోపాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు వినతిపత్రాలు అందజేస్తున్నారు. దీంతో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనువైన గదుల కోసం వ్యాపారస్తులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

పాత ధరలకే మద్యం.. మందుబాబుల నిరాశ

● ఆత్మకూరు: ఆత్మకూరు సర్కిల్ పరిధిలో 13 మద్యంషాపులు బుధవారం ప్రారంభించాల్సి ఉండగా కొన్నిషాపులు మాత్రమే ప్రారంభ మయ్యాయి. తక్కువ ధరకే మద్యం దొరుకుతుందని వైన్‌షాపులకు వెళ్లిన మందుబాబులు పాత ధరకే మద్యం విక్రయించడంతో నిరాశకు గురయ్యారు. అన్ని రకాల బ్రాండ్ల మద్యం అందుబాటులోకి తేవడంతో పాటు నూతన ధరలకు మద్యం విక్రమించేలా అధికారులు దృష్టి సారించాలని మందుబాబులు కోరుతున్నారు.

● సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామ పురంలో నూతనంగా లాటరీ ద్వారా లైసెన్స్ పొందిన మద్యం దుకాణాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు కప్ప ప్రభాకర్ రాజు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ ప్రారంభించారు. కొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రాకపోవడంతో పాత మద్యం బ్రాండ్లను బుధవారం విక్రయించారు.

● అనంతసాగరం : మండలంలో మొత్తం మూడు మద్యం షాపులు మంజూరు కాగా బుధవారం సోమశిల, రేవూరులో మాత్రమే కొత్తషాపులు ప్రారంభించారు. అనంతసాగరంలో షాపు తెరవలేదు. మద్యం ధరలు తగ్గుతాయని మద్యం ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● కలువాయి : ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం రాత్రి మూతపడి బుధవారం సాయంత్రం తెరుచుకున్న ప్రైవేటు షాపు వద్ద మద్యం కోసం మందుబాబులు ఎగబడ్డారు. పాత ధరకే విక్రయించడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

గ్రామాల్లో అధికారుల పర్యటన

సైదాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండల అధికారుల బృందం బుధవారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కలిచేడు గ్రామ చెరువు కట్ట బలహీనంగా ఉన్నందున కట్టను పరిశీలించారు. ఊటుకూరు వద్ద ఉన్న మావిలేరువాగు, తురిమెర్ల వద్ద ఉన్న పిన్నేరు వాగుల చప్టాలను పరిశీలించి అడ్డంగా ఉన్న ముళ్ళ చెట్లను తొలగించారు. పాలూరులో లోతట్టు ప్రాంతంలో ఉన్న గిరిజనులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రమాదేవి ఆదేశాలిచ్చారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, రాపూరు సీఐ విజయ్‌కృష్ణ, ఎస్‌ఐ కాంతికుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.

కల్తీ పెట్రోలు నింపారని ఆందోళన

కోవూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తమ వాహనాల్లో నీరు కలిపిన పెట్రోలు నింపారని వినియోగదారులు బుధవారం ఆందోళన వ్యక్తంచేశారు. జాతీయరహదారి పక్కన కోవూరుకు సమీపంలోని ఓ పెట్రోలు బంకులో పెట్రోలులో నీరు కలిపి విక్రయిస్తున్నారని పలువురు ఆందోళనకు దిగారు. తహసీల్దారు నిర్మలానందబాబా, ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ పెట్రోలు బంకు వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. పెట్రోలులో నీరు కలిపి విక్రయించినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని అధికారులు వారికి హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

పడుగుపాడులో మెటల్ రోల్స్



రైల్వేస్టేషన్‌లో మెటల్ రోల్స్ దించుతున్న ఎక్స్‌కవేటరు

కోవూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పడుగుపాడు రైల్వేస్టేషన్‌కు బుధవారం మెటల్ రోల్స్‌తో కూడిన వ్యాగిన్ చేరుకుంది. రైల్వే కూలీలు భారీ వర్షంలోనూ మెటల్ రోల్స్‌ను ఎక్స్‌కవేటర్ల సహాయంతో లారీల్లోకి చేర్చారు. మెటల్ రోల్స్‌ను విదేశాల నుంచి కృష్ణపట్నం పోర్టు ద్వారా దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. లారీల్లో వాటిని వివిధ పాంతాలకు తరలించారు.

21న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16 (అంధ్రజ్యోతి) : జనహిత-వాత్స ల్య అనాథ శరణాలయంలో ఈనెల 21న యుఎస్‌ఏకు చెందిన ప్రేమ్‌సాగర్ రెడ్డి ఫౌం డేషన్, ప్రేమ్ హెల్త్‌కేర్‌ల ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారని జనహిత-వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనారిటీ సీనియర్ నాయకుడు బచ్చాబాయ్ అలియాస్ సమీవుల్లా (65) మృతికి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు దినేష్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. బచ్చాబాయ్ ఖాజానగర్ ప్రజలకు ఎన్నో విధాలుగా సేవలందించి పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా దిగ్ర్భాంతి వ్యక్తంచేశారు. బచ్చాబాయ్ కుమార్తె, మాజీ ఎంపీటీసీ ఎస్‌కే. పర్వీన్‌కు ఫోన్‌చేసి మృతిపై కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబసభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.

బుచ్చిలో ఐదు మద్యం షాపుల ఏర్పాట్లు

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు16,(ఆంధ్రజ్యోతి): బుచ్చిలో బుధవారం రాత్రి ఏడు గంటల తరువాత మొత్తం ఏడు మద్యం షాపులు ఏర్పాటు అయినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ తెలిపారు. తొలుత ఉదయం 10గంటలకు మలిదేవి కాలువ పక్కన ఒక్క మద్య దుకాణం మాత్రమే ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం శాంతినగర్‌లోని మద్యం షాపు ఏర్పాటుకు స్థానికులు అభ్యంతరం మేరకు ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం అయ్యేవరకు ఆపినట్లు తెలిపారు.

● రూ.వందకు ఇస్తామనీ..

కొత్తగా మద్యం షాపులు ఏర్పాటైన వెంటనే క్వార్టర్ బాటిల్ రూ. 100లకే ఇస్తామన్నారు కదా...? రూ. 120 తీసుకుంటున్నారు ఏమిటని పలువురు మందుబాబులు దుకాణం నిర్వాహకులను ప్రశ్నించారు. ఇంకా ఆ తరహా మద్యం రాలేదని వారు తెలిపారు. ఎమ్మార్పీ రూ. 120 తీసుకుంటున్నామని నిర్వాహకులు మందుబాబులకు చెప్పారు. దీంతో కొత్త మద్యం షాపులొస్తే రూ. 100కే ఇస్తారని ఎంతో సంతోషంతో వస్తే ఇదేంటయ్యా రూ.120 తీసుకుంటున్నారని మందుబాబులు పెదవి విరిచారు.

నాణ్యమైన వంగడాలను ఎంచుకోండి

నెల్లూరురూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): త్వరలో మొదలుకానున్న రబీ సీజన్‌లో నాణ్యమైన వరి వంగడాలను ఎంచుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని దొంతాలి, అంబాపురం గ్రామాలలో రైతులతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్‌లు మాట్లాడుతూ పీఎం కిసాన్ నిధులు జమకాని వారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని, ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

వీడని వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

● లోతట్టు ప్రాంతాల జలమయం ● పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు ● భోజనం, తాగునీటి ఏర్పాట్లు

జిల్లాలో వరుసగా మూడోరోజు బుధవారం కూడా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. అధికారులు ముంపు వాసులను పునరావాస కేంద్రాలకు తరలించి, భోజనం, తాగునీటి వసతి కల్పించారు. గురువారం కూడా వర్ష సూచన ఉండడంతో శివారు ప్రాంతవాసులు బెంబేలెత్తుతున్నారు.

ముత్తుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రతను ఎదుర్కొనేందుకు అన్నీ విధాలా సన్నద్ధంగా ఉన్నామని నెల్లూరు ఆర్డీవో నాగసతీష్ అనూష తెలిపారు. నేలటూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం తహసీల్దారు బాలకృష్ణారెడ్డితో కలిసి ఆమె పరిశీలించి, పరిస్థితులను సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ తీరగ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆహార, విద్యుత్, ఆరోగ్య అవసరాలను తీర్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. వర్షాలతో ఇబ్బందిపడుతున్న నేలటూరు పట్టపుపాలెం, దళితవాడ ప్రజలను ముందు జాగ్రత్తగా నేలటూరుపాలెం పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. అలాగే కృష్ణపట్నం సీఐ రవినాయక్, ముత్తుకూరు, కృష్ణపట్నం ఎస్‌ఐలు విశ్వనాధ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సిబ్బందితో కలిసి లోతట్టు ప్రాంతాలు, తీర గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లవద్దని, వలలను, బోట్లను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని తెలిపారు. తుఫాన్ ప్రభావంతో బుధవారం ముత్తుకూరులో జోరుగా వర్షం కురిసింది.

● కోవూరులో ఎడతెరపిలేని వర్షం

కోవూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయ ఆవరణ, ప్రభుత్వ వైద్యశాల ఆవరణల్లో వర్షపు నీరు చేరింది. నీటి ప్రవాహం వల్ల వేగూరు కాలువ కట్ట పలుచోట్ల తెగడంతో నీరు లోతట్టు ప్రాంతంలోని పొలాల్లోకి పారుతోంది. పడుగుపాడు ఎన్టీఆర్ కాలనీవాసుల్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తహసీల్దారు నిర్మలానందబాబ రెవెన్యూ సిబ్బందితో కలిసి లోతట్టుప్రాంతాల్లో పర్యటించారు.



కోవూరు తహసీల్దారు కార్యాలయం ఆవరణలో చేరిన వర్షపునీరు



ముత్తుకూరు : పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో నాగసంతోష్ అనూష



విడవలూరు : బాధితులకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకుడు ఆవుల వాసు

● జనజీవనం అస్తవ్యస్తం

విడవలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రామతీర్థం, రామచంద్రాపురం గ్రామాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. దీంతో బుధవారం స్థానిక టీడీపీ నాయకులు ముంపు ప్రాంత కాల నీల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులకు స్థానిక టీడీపీ నాయకులు ఆవుల వాసు, శ్రీహరికోట గోపి, హరి, చిన్నిబాబు, చిట్టిబాబు, ప్రళయకావేరి బాబు, కోడూరు పోలయ్య, కొండూరు జేజీ, నాగేంద్రబాబు ఆహార పొట్లాలు, తాగు నీటిని అందించారు. ముదివర్తి గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదీ కరకట్టలకు ఉన్న గండ్లని స్థానిక టీడీపీ నాయకుడు ఎస్‌కె రఫీ ఎక్స్‌కవేటర్ సాయంతో పూడ్చివేయించారు. గాదెలదిన్నె గ్రామ సమీపంలో ఉన్న పైడేరు డ్రెయిన్ కరకట్టలు వర్షానికి దెబ్బతిన్నాయి. స్పందించిన టీడీపీ నాయకులు దిలిప్, కోడిమేర్ల శేషయ్య అధికారులకు సమాచారం ఇచ్చి వారి సహాయంతో కరకట్టలకు మరమ్మతులు చేయించారు.

● ఇబ్బందులు పడిన జనం

పొదలకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలమంతా మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నావూరు పెద్ద వాగు విస్తృతంగా ప్రవహిస్తోంది. అటువైపు రాకపోకలు సాగకుండా పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక విఘ్నేశ్వరకాలనీ, వినాయకమాన్యం, శ్రీహరికాలనీలోని లోతట్టు ప్రాంతంలో నీరు చేరింది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

● బుచ్చిలో కుండపోత వర్షం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజల నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది దీంతో కాలువలు, పొలాలు, చెరువులు జలమయమయ్యాయి. రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. మినగల్లు బీసీ కాలనీ వద్ద వున్న గిరిజన కాలనీ జలమయం కావడానికితోడు ఇళ్లన్నీ ఉరుస్తున్నాయి. దీంతో గిరిజనులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. స్థానిక వార్డు సభ్యులు నరసింహులు వారికి బియ్యం, కూరగాయలు పంపిణీ చేసి పునరావాస కేంద్రానికి తరలించారు. కాగా మండలంలోని పెనుబల్లి, కాళయకాగొల్లు, మినగల్లు, దామరమడుగు తదితర ప్రాంతాల్లోని సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కవల్ల వర్షం నీళ్లు ముందుకు పోక రైతులు అవస్థలు పడ్డారు. పెనుబల్లిలో తామరగుంట నిండుకుని కరకట్టలు తెగే పరిస్థితి నెలకొనడంతో రైతులు స్వచ్ఛందంగా ఎక్సకవేటర్‌తో సదరన్ చానల్‌లో గుర్రపుడెక్క తొలగించారు. తహసీల్దారు, ఎంపీడీవో, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

● కనిగిరి రిజర్వాయర్ పరిశీలన

బుచ్చిలోని కనిగిరి రిజర్వాయర్‌ను తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, ఇరిగేషన్ ఏఈఈతో కలిసి బుధవారం పరిశీలించారు. రిజర్వాయర్ సామర్థ్యం 3.454 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.817 టీఎంసీల నీరుందన్నారు.

● పునరావాసానికి 60మంది గిరిజనులు

మనుబోలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా వర్షం పడుతుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికే మండలంలో కల్లేరు, పిల్లేరు వాగులు నిండుగా పారుతున్నాయి. ఇప్పుడిప్పుడే చెరువులు నిండుకుంటున్నాయి. మరో పక్క పంటపొలాలన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. మండల అధికారులు గ్రామాల్లో పర్యటించి పల్లపుప్రాంతాల కాలనీవాసులను హెచ్చరిస్తున్నారు. లక్ష్మీనరసింహపురం చల్లా యానాదులను గ్రామంలోని పునరావాస కేంద్రంకు తరలించారు. 25కుటుంబాలనుంచి 60మందిని కేంద్రానికి తరలించి వారికి పాలు, మజ్జిగ, భోజన సదుపాయాలను తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య, ఎంపీడీవో జలజాక్షి, వీఆర్‌వోలు, కార్యదర్శులు ఏర్పాటు చేశారు. దుప్పట్లు అందించారు. కొలనుకుదురులో ఎస్‌ఐ శివరాకేష్ గిరిజన కాలనీలు తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. తుఫాన్ షెల్టర్‌లో తలదాచుకుంటున్న పేదకుటుంబాలకు బియ్యం అందజేశారు.

● సర్వేపల్లి రిజర్వాయర్ కట్టకు బస్తాల ఏర్పాటు

వెంకటాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాగా గత ఏడాది కురిసిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా సర్వేపల్లి రిజర్వాయర్ కట్ట అక్కడక్కడ కోతలకు గురైంది. ఆ ప్రదేశంలో ఇసుక, మట్టి బస్తాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కట్ట కోతకు గురవుతుందన్న భయంతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా కోతకు గురైన చోట్ల ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తరలించడంతోపాటు కట్ట కోతకు గురికాకుండా ఉండేందుకు ఇసుక, మట్టి బస్తాలను ఏర్పాటు చేశారు.

● కైవల్యా నదికి జలకళ

సైదాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కైవల్యా నదికి జలకళ సంతరించుకుంది. మామిడి, సపక సాగు చేసుకుంటున్న రైతుల్లో ఆనందం నెలకొంది. సైదాపురం-పొదలకూరు రెండు మండలాలను కలిపే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి డేగపూడి వరకు గుంతలయమంగా ఉంది. నిత్యం వాహన రాక పోకలకు అంతరాయం కలుగుతోంది. వర్షపు నీటితో నిండి మడుగును తలపిస్తోంది. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డుకు మోక్షం కలుగుతుందని వాహన చోదకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కూడా వర్ష సూచన ఉందని అధికారులు తెలియచేశారు.

మూడవ రోజూ.. అదే జోరు..!

● తెరిపివ్వని వరుణుడు
● లోతట్టు ప్రాంతాలను చుట్టుముట్టిన వర్షపు నీరు
● పునరావాస కేంద్రాలకు 532 మంది
● రోడ్డెక్కిన యంత్రాలు, యంత్రాంగం





జలమయమైన రామకోటయ్య నగర్, రహదారిపై నిలిచిన నీటిలో వాహనాలు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం, దీనికి తోడు ఈశాన్య రుతుపవనాలు కూడా తోడవడంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జోరు తగ్గని వాన నెల్లూరును జలదిగ్బంధం వైపు నెట్టేస్తుంది. వరుస వానలతో నగరంలో ఎక్కడ చూసినా రహదారులు, రోడ్లు, కూడళ్లు, లోతట్టు ప్రాంతాలు, నివాసాలు, ఖాళీ స్థలాలు జలాశయాలుగా మారాయి. భారీ వర్షానికి కాలువల్లో పారుదల సామర్థ్యం లేక మురుగు వర్షపునీటితో కలిసి రోడ్లపైకే వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతోన్నారు. కాగా బుధవారం నెల్లూరులోని ప్రధానంగా వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద 63, కార్పొరేషన్ కార్యాలయం వద్ద 53, పడారుపల్లి 37.75, మాదరాజుగూడూరులో 28.5 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. వరుస వానలతో నగరంలోని వివిధ శ్రేణుల ప్రజలు ఉపాధిని కోల్పోతున్నారు. కార్యాలయాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాహనదారులు, పాదాచారులు బయటకు రాలేని దుస్థితి ఏర్పడింది. అత్యవసరాలకు బయటకు వచ్చేవారు ఆటోలు, కార్లు, జీపుల్లో రోడ్లపై నిలిచిన నీటితాకిడికి అవస్థలుపడుతున్నారు. అక్కడక్కడ విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడుతుండడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది 24 గంటలు పాటు షిఫ్టులతో పని చేస్తున్నారు. కమిషనర్ సూర్యతేజ నగరంలో సుడిగాలి పర్యటన చేస్తూ ప్రమాదాలకు నిలయాలుగా మారిన ప్రాంతాలను ప్రత్యేక జోన్లగా గుర్తిస్తున్నారు. నెల్లూరులోని నాలుగ ప్రాంతాలలో ఉన్న అండర్ బ్రిడ్జిల వద్ద భారీ మోటార్లతో వర్షపు నీటిని వరుసగా బయటకు తోడేస్తున్నారు. నగరంలోని మురుగు కాలవల్లో పూడికతీత పనులు కొనసాగించిన అధికారులు కాలువలపై నిర్మించిన తాత్కలిక కట్టడాలు, ర్యాంపులు, దుకాణాలు కూల్చేస్తున్నారు.

● 532 మంది పునరావాసం

భారీ వర్షాలకు నెల్లూరులోని లోతట్టు ప్రాంతాలలోని నివాసాల్లోకి నీరు చేరడంతో బాధిత ప్రజలను మున్సిపల్ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. లోతట్టుకు సమీపాన పలు ప్రభుత్వ భవనాలను గుర్తించి 13 చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బుధవారం సాయంత్రానికి 532 మందిని తరలించి మూడుపూట్ల ఆహారం, తాగునీరు, విద్యుత్, దుప్పట్లు, చిన్నారులకు పాలు, వైద్య సదుపాయాలను సమకూర్చుతున్నారు. మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజలు పర్యవేక్షించారు. కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ భవనంలో 24 గంటల పాటు సిబ్బందిని నియమించి హెల్ప్‌లైన్లు కొనసాగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. మరొక పక్క లోతట్టు ప్రాంతాలైన 20,21,23,24,31,32 డివిజన్లలోని పార్టీ శ్రేణులతో కలిసి టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పర్యటించారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరురూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : పెన్నా పరివాహకం వెంబడి లోతట్టు ప్రాంతాలలో జీవించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరురూరల్ తహసీల్దారు లాజరస్ సూచించారు. బుధవారం పెన్నా వెంబడి పొట్టేపాళెం, గొల్లకందుకూరు, జొన్నవాడ రహదారి పైనున్న కలుజు, ములుముడి గ్రామం, చెరువు కలుజులను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉండే లోతట్టు ప్రజలతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వర్షపు నీరు నివాసాల వద్దకు చేరుకోగానే ప్రభుత్వ భవనాల్లోని పునరావాస కేంద్రాలకు చేరుకుని సురక్షితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మహేష్ పాల్గొన్నారు.



వర్షాలున్నాయ్.. గొడుగులో తీసుకోండి! వీఆర్సీ వద్ద విక్రయిస్తున్న గొడుగులు



కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలిలో రహదారిపై నిలిచిన వర్షం నీరు



పునరావాస కేంద్రంలో ఆహారం వడ్డిస్తున్న కమిషనర్

రేషన్ సరుకులతో ఎండీయూ ఆపరేటర్ పరార్

● ఏసీ, బాలాజీనగర్ వాసులకు అందని నిత్యావసరాలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ సరకులు పంపిణీ చేయడానికి డీలర్ వద్ద సరుకులు తీసుకుని వాహనంతో కూడా ఎండీయూ ఆపరేటర్ పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు.. ఏసీనగర్, బాలాజీనగర్‌లకు ఒక ఎండీయూ ఆపరేటర్ తన వాహనం ద్వారా సరకులు పంపిణీ చేస్తుంటాడు. గత నాలుగు నెలల నుంచి అరకొరగా సరకులు పంపిణీ చేస్తున్న ఈ ఆపరేటర్ ఈనెలలో డీలర్ దగ్గర సరకులు తీసుకుని ఒకరిద్దరికి పంపిణీ చేసి పత్తా లేకుండా పోయాడు. ప్రతినెలా 1 నుంచి 17వ తేదీ వరకు రేషన్ సరకులు పంపిణీ చేయాల్సి ఉండగా ఆ ఆపరేటర్ పత్తా లేకుండా సరకులతో ఉడాయించాడని రేషన్ డీలర్లు, సంబంధిత ప్రాంతాల ప్రజలు తెలిపారు. ప్రజలు సరకుల కోసం డీలర్‌లను సంప్రదించటంతో తమకు సరకులు పంచే అధికారం లేదని, ఎండీయూ వాహనం ఆపరేటరే పంచాలని సమాధానం ఇవ్వడంతో వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సివిల్ సప్లయిస్ అధికారులు సంబంధిత ప్రాంత రేషన్ షాపులను పరిశీలించి ఎండీయూ వాహనదారుడు పరారైనట్లు గుర్తించారు. ఈ విషయం కార్డుదారులు అర్బన్ తహసీల్దారు షఫీమాలిక్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ ఆపరేటర్‌పై పోలీసు కేసు నమోదు చేయించనున్నారు. ఈ విషయమై తహసీల్దారు షఫీమాలిక్‌ను వివరణ కోరగా ఏసీనగర్, బాలాజీనగర్‌లలో సరకులు పంపిణీ చేసే ఎండీయూ వాహన ఆపరేటర్ కనిపించకుండా పోయాడనే ఫిర్యాదులు అందాయన్నారు. ఈ విషయం తేల్చడానికి బుధవారం వీఆర్వోలను సంబంధిత డీలర్‌ల వద్దకు పంపామని, ఆ ఆపరేటర్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అతని వద్ద నుంచి ఈపాస్ మిషన్ తీసుకుని రేషన్ షాపు ద్వారానే కార్డుదారులకు సరకుల పంపిణీ చేయించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి) : 'మా నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు. ఐదేళ్లుగా నానా అవస్థలు పడ్డాం. ఆడపిల్లలు, మహిళలు ఈమార్గంలో తిరగలేని పరిస్థితి. మద్యం తాగించేందుకు అనుమతులేకున్నా కూల్‌డ్రింక్ షాపులు పెట్టి రేయింబవళ్లు ఇక్కడే తాగించి నానా ఇబ్బందులకు గురిచేశారు', అంటూ మద్యం దుకాణం ఏర్పాటును బుధవారం బుచ్చి వాసులు అడ్డుకున్నారు. దీంతో సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎక్సైజ్ సీఐ కిషోర్, ఎస్‌ఐ, సిబ్బంది అక్కడికి చేరుకుని సర్దిచెప్పినా వారు వినలేదు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు షాపు తీయొద్దని చెప్పడంతో మహిళలు శాంతించారు. ఎన్నికలకు ముందు మా ఇబ్బందులను ప్రశాంతమ్మకు విన్నవించాం. షాపును తొలగించేలా ఆమె మాకు మాటిచ్చారు. అయితే టీడీపీ నాయకులే మద్యం దుకాణం ఏర్పాటు చేస్తామనడం దుర్మార్గమని మహిళలు పేర్కొన్నారు.

● నెరవేరిన మందుబాబుల కోరిక



కోవూరు : వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబులు

కోవూరు అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాతబ్రాండ్ల మద్యాన్ని కొత్తగా సేవించాలనే మందుబాబుల కోరిక బుధవారం ఎట్టకేలకు నెరవేరింది. మద్యం దుకాణాలను కూటమి ప్రభుత్వం వేలం ద్వారా వ్యాపారులకు కేటాయించి, పాత మద్యం బ్రాండ్లకు అనుమతినిచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో 'జే' బ్రాండ్లతో విసిగి వేసారిన మందుబాబులు ఐదేళ్ల కిందట తాగిన పాత బ్రాండ్ మద్యం సీసాలను అమ్మకానికి పెట్టడంతో సంతోషంలో మునిగిపోయారు. స్థానిక బజారు కూడలిలో బుధవారం దుకాణం ప్రారంభం కాగానే మందుబాబులు బారులు తీరారు. తమకిష్టమైన బ్రాండ్లను కొనుగోలు చేసి తనివితీరా తాగారు.

● మద్యం పాత ధరలతో నిరాశ

కొత్త మద్యం దుకాణాలను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఉదయాన్నే తీయకపోవడంతో మందుబాబులు మద్యం కోసం అల్లాడారు. దుకాణాలు కొత్తవైనా మద్యం ధరలు మాత్రం పాతవే కావడంతో మందుబాబులు నిరాశకు గురయ్యారు.

● ఇచ్చారయ్యా సాయంత్రానికి సీసా !

మనుబోలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి మందుచుక్క గొంతులోకి పోక మందుబాబులు అల్లాడిపోయారు. ఎట్టకేలకు బుధవారం సాయంత్రానికి మనుబోలు, కాగితాలపూరు క్రాస్‌రోడ్డులో కొత్త మద్యం దుకాణాలను ప్రారంభించారు. సాయంత్రానికల్లా సీసా దక్కడంతో మందుబాబులో ఆనందం వెల్లివిరిసింది.

● మద్యం దుకాణాల ప్రారంభం

పొదలకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలు దక్కించుకున్నవారు బుధవారం ప్రారంభించారు. మండలంలో ఆరు దుకాణాలకుగాను ఒకటి తాటిపర్తిలో, మరొకటి సూరాయపాలెంలో, రెండు పొదలకూరులో ప్రారంభమయ్యాయి. మరో రెండు దుకాణాలు ప్రారంభం కావాల్సి ఉంది.

బాలసంస్కార్ కేంద్రానికి రూ.50వేల విరాళం

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జయభారత్ ఆసుపత్రి నిర్వహిస్తున్న బాలసంస్కార్ కేంద్రానికి (సాయం బడులు) భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జేపీ జైన్ రూ.50వేల విరాళం ఇచ్చారు. ఈ మేరకు బుధవారం చెక్‌ను జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత జేపీ జైన్ మాట్లాడుతూ వెంకటాచలం మండలం శ్రీకాంత్ కాలనీలో జరుగుతున్న కేంద్రాన్ని దత్తత తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పణతుల వారి వీధికి చెందిన అమరా సుధాకర్‌రావు (68) బుధవారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల కోరిక మేరకు టెక్నీషియన్ వేణుగోపాల్ నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్, కుటుంబ సభ్యులు సుజన, వాణి, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఘనంగా మత్తు వైద్యుల దినోత్సవం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో బుధవారం ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఇందు లో ముఖ్య అతిధులుగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌లు పాల్గొన్నారు. మత్తు విధానాన్ని కనుగొన్న డాక్టర్ మెర్టాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు వైద్య విభాగంలో పీజీ విద్యార్థులు కొత్త పరిశోధనలు చేయాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ శస్త్రచికిత్సలలో మత్తు వైద్యుల ప్రాముఖ్యత గురించి వివరించారు. మత్తు వైద్య విభాగాదిపతి డాక్టర్ శ్రీనివాసరావ్ మాట్లాడుతూ మత్తు వైద్యం లో ఎన్నో విప్లవాత్మక విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ శాంతి చేసిన వైద్య సేవలను కొనియాడితూ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మస్తాన్‌బాషా, మత్తు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు

నగరంలో ముస్లింల ర్యాలీ



నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్తను అవమానిస్తూ యతి నరసింహానంద చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ముస్లింలు బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ జియా ఉల్‌హక్ మాట్లాడుతూ నరసింహానంద రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు ముస్లింల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. ఈ విషయమై నగరంలోని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ ర్యాలీలో సయ్యద్ సమి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ భవనాల్లో భద్రత ఏదీ?

● నిరుపయోగంగా తుఫాన్ షెల్టర్లు

తోటపల్లిగూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుపాన్లు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో తీరప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు నిర్మించిన తుపాను భవనాలు గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో భద్రత కరువై నిరుపయోగంగా మారాయి. ఈ భవనాల మరమ్మతులు, కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు విఫలం కావడంతో అవి ప్రజలకు ఉపయోగపడక అలంకారప్రాయంగా మారాయి. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన వెంకన్నపాలెం, కోడూరుపాలెం, ఈదూరువారిపాలెం, మల్లికార్జునపురం, మండపం, అనంతపురం గ్రామాల్లో 16 తుపాను షెల్టర్లు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు వర్షాకాలం వస్తే వాటిని వినియోగించుకునేవారు. అయితే వాటి ఆలనా పాలన మరిచిన పాలకులు, అధికారుల చర్యలతో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాల సమయంలో అధిక శాతం ప్రజలకు ఆసరాగా ఉండే తుపాను షెల్టర్లలో ప్రస్తుతం విద్యుత్, తాగునీరు సౌకర్యం, తదితర వసతులు లేవు. దీంతో షెల్టర్లలో భద్రత లేకుండా పోయింది. ఇదిలా ఉండగా అధికారులు పర్యవేక్షణ కూడా లేకపోవడంతో కొన్ని భవనాలకు కిటికీలు, గదులకు తలుపులు కూడా లేకుండా అస్తవ్యస్తంగా ఉన్నాయి. స్థానికులు కూడా వాటిని సక్రమంగా వినియోగించుకునే పరిస్థితి కనిపించడంలేదు. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమైనందున అధికారులు స్పందించి రక్షణ భవనాలకు మరమ్మతులు చేపట్టి కనీస వసతులతో తీరప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సూళ్లూరుపేట మండలం పేర్నాడు రోడ్డులో ఏర్పడిన గుంతతో పులికాట్ పల్లెలకు ఆగిన రాకపోకలు - బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్ట్‌వరత్తూరులో నీటమునిగిన వరిపంట - బకింగ్‌హామ్ కెనాల్ వరదనీరు తమ గ్రామాలపైకి రాకుండా మత్స్యకారులంతా కలిసి సొంత ఖర్చుతో గోవిందపల్లిపాళెం సముద్రంవద్ద ముఖద్వారం పూడికతీస్తున్న దృశ్యం

ముసురు

- రోజంతా నిలకురిసిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- తిరుపతి-చెన్నై గరుడాద్రి రైలు రద్దు

తిరుపతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లావ్యాప్తంగా బుధవారం ముసురువాన పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుపతిలో వర్షపు నీటి ఉధృతికి డ్రైనేజీ కాలువలు పొంగడంతో రోడ్లన్నీ నీట మునిగాయి. తిరుచానూరులో కబ్జాదారులు పెద్ద చెరువుకు గండికొట్టడంతో అనేక కాలనీలు, అపార్టుమెంట్లలోకి నీరు ప్రవేశించింది. పెళ్ళకూరు మండలం పునబాక దళితవాడలో పూరిల్లు నీట మునిగింది. జిల్లావ్యాప్తంగా 208 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం నీట మునిగే ప్రమాదమున్న 52 లోతట్టు ప్రాంతాల నుంచీ 1183 మందిని ఆ కేంద్రాలకు తరలించారు. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం ఉదయం 6.20 గంటలకు తిరుపతి నుంచీ చెన్నైకి వెళ్ళాల్సిన గరుడాద్రి ఎక్స్‌ప్రెస్‌ను రద్దుచేశారు. పరిస్థితి ఇలాగే వుంటే గురువారం కూడా రద్దయ్యే అవకాశముంది.



నీటి ప్రవాహంతో మట్టి రోడ్డు కొట్టుకుపోతే జలదిగ్బంధంలో చిక్కుకుపోయే తమ గ్రామాలను కాపాడాలని వేడుకుంటున్న కేవీబీపురం పూడి గ్రామాల ప్రజలు

చెరువులు, రిజర్వాయర్లలోకి చేరుతున్న నీరు

జిల్లాలో 2446 చెరువులుండగా వాటిలో ఐదు నిండిపోయి కలుజులు పారుతుండగా మరో పది దాదాపుగా నిండిపోయాయి. 32 చెరువులు 70 శాతం నిండగా 136 చెరువులు 50 శాతం, మిగిలిన 2265 చెరువులు పాతిక వంతు నిండాయి. రిజర్వాయర్ల విషయానికొస్తే కండలేరులో 68 టీఎంసీలకు గానూ 33.15 టీఎంసీల నీరు చేరింది. 5600 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుండగా 345 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాళంగిలో 0.240 టీఎంసీలకు గానూ 0.078 టీఎంసీల నీరుండగా 1388 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. అరణియార్‌లో 1.85 టీఎంసీలకు గానూ 0.682 టీఎంసీల నీరు వుండగా 1660 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. వడమాలపేట మండలం టీఎస్ఆర్‌పురంలో గూళూరు చెరువు నిండిపోయి ప్రమాదకర పరిస్థితిలో వుంది.

పులికాట్ వద్ద తీరం దాటనున్న వాయుగుండం

తిరుపతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం పులికాట్ వద్ద (సూళ్లూరుపేట- తమిళనాడులోని పొన్నేరి మధ్య) తీరం దాటే అవకాశముంది. తీరం దాటాక జిల్లాకు భారీ వర్షాలతో పాటు మెరుపు వరదలు సంభవించే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ ప్రాంతానికి చేరువగా ఉన్న తడ, సూళ్లూరుపేట, సత్యవేడు, వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ, దొరవారిసత్రం, కేవీబీపురం మండలాలకు మరింత ముప్పు వుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను ఈ ప్రాంతాలకు రప్పిస్తున్నారు. చెరువులు, వాగులకు గండ్లు పడే అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి 50 టిప్పర్లు, 50 వేల ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచారు. 143 చోట్ల పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బ తినడానికి ఆస్కారముందని భావించి మొత్తం 107 జేసీబీలను, వృక్షాలు కూలి రాకపోకలకు ఇబ్బంది కలిగితే వాటిని తొలగించడానికి 53 మర రంపాలను సిద్ధం చేశారు. లోతట్టు ప్రాంతాలకు చెందిన 59 మంది గర్భవతులను గుర్తించి ఆస్పత్రులకు తరలించారు.

సూళ్లూరుపేట: మరోవైపు సూళ్లూరుపేటలో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో అధికారుల బృందం లోతట్టు ప్రాంతాలను సందర్శించి, కల్వర్టు, కాలువలు, కాళంగి నదిని పరిశీలించారు. పులికాట్ తీరం వెంబడి ఉండే గ్రామ ప్రజలను అప్రమత్తం చేశారు.

వాగుల ఉధృతితో ఆగిన రాకపోకలు

తిరుపతి రూరల్ మంగళం కేబీఆర్ నగర్ వద్ద వర్షపు నీటి ఉధృతికి కల్వర్టు కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయి. శ్రీకాళహస్తి- ముచ్చివోలు, పాలచ్చూరు వద్ద పులికాలువ, ఓజిలి మండలం నెమళ్ళపూడి-పున్నేపల్లి నడుమ, సూళ్ళూరుపేట మండలం ఇలుపూరు-మంగలంపాడు మధ్య కాజ్‌వేలపైకి నీళ్ల చేరడంతో రాకపోకలు ఆగాయి. పెళ్లకూరు మండలం కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిపై భారీ చెక్ డ్యామ్ నిండిపోయి వరద ప్రవాహం పెరగడంతో రాకపోకలకు బ్రేక్ పడింది. పుత్తూరు మండలం రాచపాలెం మార్గంలో అండర్ బ్రిడ్జి నీట మునగడంతో రాకపోకలు ఆగాయి. పుత్తూరు మండలం తొర్రూరు-పైడిపల్లి.. పిళ్ళారిపట్టు కాజ్‌వేలపైకి వరద నీరు చేరింది.

6500 ఎకరాల్లో నీట మునిగిన పంటలు

జిల్లాలో మొత్తం 6500 ఎకరాల్లో వివిధ పంటలు నీట మునిగాయి. 187 ఎకరాల్లో వరి నారు.. 5477 ఎకరాల్లో 20 రోజుల కిందట నాటిన వరి.. 782 ఎకరాల్లో దుబ్బు దశలో వున్న.. మరో పాతిక ఎకరాల్లో కోతకు సిద్ధంగా వున్న వరి పంట దెబ్బతింది. మరో 10 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది.

నేడూ విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి విద్య, ఆంధ్రజ్యోతి: జిల్లాలోని విద్యాసంస్థలకు గురువారం కూడా సెలవు ప్రకటించారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలలకు సెలవు ఇస్తున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు.

ఏర్పేడులో 10 సెంటీమీటర్ల వాన

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం ఉదయం 8.30 నుంచి రాత్రి9గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు ప్రకటించారు. ఏర్పేడు మండలంలో 103.4మి.మీ., పెళ్లకూరు 83.4, రేణిగుంట 80.6, శ్రీకాళహస్తి 70.8, వెంకటగిరి 69, దొరవారిసత్రం 66.8, తొట్టంబేడు 63.6, వడమాలపేట 63.2, నారాయణవనం 61, తిరుపతి అర్బన్ 54.8, తిరుపతి రూరల్ 51.2, పుత్తూరు 49.2, చిల్లకూరు 47.44, రామచంద్రాపురం43.8, డక్కిలి 41.2, చిల్లకూరు 38.6, సూళ్ళూరుపేట 37.4, పిచ్చాటూరు, ఎ రావారిపాళెం, 36.2, బీఎన్‌కండ్రిగ 35.8, చంద్రగిరి 35.6, వాకాడు38.6. బాలయపల్లి 35.8, గూడూరు 33.4, చిన్నగొట్టిగల్లు 30మి.మీ. చిట్టమూరు 29.8 మి.మీ. చొప్పున పడింది. సగటు వర్షపాతం 43.9మి.మీ. నమోదైంది.




తడలో పునరావాస కేంద్రానికి చేరిన లోతట్టు ప్రాంత ప్రజలు - రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ కల్లూరు వంక కాలువలో నీటి ప్రవాహం వల్ల రోడ్డుకు ముళ్లకంప వేసిన అధికారులు




తిరుపతిలో రోడ్డుపై చేరిన వర్షపునీరు - తిరుపతిలో అండర్ బ్రిడ్జిలోకి చేరిన వర్షపునీరు



పుత్తూరు మండలం పైడిపల్లి కాజ్‌వేపై నీటి ప్రవాహంతో ఆగిన రాకపోకలు



మబ్బుల తోట

తిరుపతి నగరం ఇంత వగలుపోయేదీ..
ఈ కొండలు చూసుకునే! మబ్బులు కమ్మితే.. వాన కురిస్తే..
ఇక పట్టలేం. కపిలతీర్థం ఉరుకులు.. మాలాడగుండం
పరుగులు.. కనుమ దారిలో జలధారలు..
పచ్చని లోయల్లోకి వాలి కవ్వించే మొయిళ్లు..
బుధవారంనాటి ఈ అందాలను ఆంధ్రజ్యోతి తిరుమల
ఫొటోగ్రాఫర్ కెమెరాలో పట్టి అందిస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





ఆశలు ఆవిరై..!

- విషాదం మిగిల్చిన అమెరికా ప్రమాదం
- ఇద్దరు శ్రీకాళహస్తివాసులు, ఓజిలికి చెందిన ఒకరు దుర్మరణం
- మరో యువకుడి పరిస్థితి విషమం

విలపిస్తున్న హరితారెడ్డి తల్లిదండ్రులు






తీవ్రంగా గాయపడిన సాయితేజారెడ్డి, మృతిచెందిన హరితారెడ్డిల ఫైల్‌ఫొటో

శ్రీకాళహస్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లల చదువు కోసం పట్టణానికి వచ్చారు. వారి ఉన్నతిని చూసి పొంగిపోయారు. ఇంతలో వారి ఆశలు ఆవిరయ్యాయి. అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శ్రీకాళహస్తికి చెందిన హరితారెడ్డి(27), శివ(30), మృతిచెందగా.. సాయితేజారెడ్డి (31) తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఓజిలికి చెందిన వీరి మిత్రుడు గోపి (30) కూడా అసువులు బాశారు.

తొట్టంబేడు మండలం చిట్టత్తూరుకు చెందిన ఉపాధ్యాయుడు డేగపూడి భాస్కర్ రెడ్డి, లత దంపతులు శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మకాలనీలో స్థిరపడ్డారు. వీరికి హరితరెడ్డి(27), తేజ కుమార్తెలు. కేవీబీపురం మండలం ఆదరం గ్రామానికి చెందిన రైతు చెన్ను బ్రహ్మానందరెడ్డి, సుగుణమ్మ దంపతులూ బంగారమ్మ కాలనీలోనే ఉంటున్నారు. వీరికి కుమార్తెతో పాటు కుమారుడు చెన్ను సాయితేజారెడ్డి(31) ఉన్నారు. ఈ రెండు కుటుంబాల మధ్య బంధుత్వం కూడా ఉండటంతో 2022 ఫిబ్రవరి 11న సాయితేజారెడ్డి, హరితారెడ్డికి వివాహమైంది. భార్యతో కలిసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన సాయితేజారెడ్డి అమెరికాలోని టెక్సాస్‌లో స్థిరపడ్డారు. హరితారెడ్డి చెల్లెలి వివాహం కోసం ఆరునెలల క్రితం వచ్చి వెళ్లారు. మరో ఏడాదిలో ఉద్యోగానికి స్వస్తి చెప్పి శ్రీకాళహస్తిలోనే స్థిరపడాలని భావించేవారు. వీరిలాగే తొట్టంబేడు మండలం చిన్నకనపర్తి గ్రామానికి చెందిన న్యాయవాది రాజినేని రమేష్‌బాబు, శివకుమారి దంపతులు తమ పిల్లల కోసం శ్రీకాళహస్తిలోని దక్షిణ కైలాసనగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి శివ(30), లోకేష్ కుమారులు. శివ రెండేళ్ల కిందట బీటెక్ పూర్తిచేసి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందారు. చిన్నకుమారుడు లోకేష్‌కు విశాఖలో మెడిసిన్ సీటు రావడంతో రమేష్ నాయుడు దంపతులు వైజాగ్‌కు నివాసం మార్చారు. అమెరికాలో ఒకేచోట పనిచేస్తున్న సాయితేజరెడ్డి, శివకు **ఓజిలి మండలం రాజుపాళేనికి చెందిన తిరుమూరు గోపి కూడా మిత్రులయ్యారు.** ఒకే ప్రాంతానికి చెందిన వీరంతా సెలవురోజుల్లో కలిసి సంతోషంగా గడిపేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయితేజరెడ్డి, హరితారెడ్డి దంపతులతో పాటు శివ, గోపి కారులో విహారానికి వెళ్లారు.అమెరికా కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 6.45 గంటలకు తిరుగు ప్రయాణంలో.. దక్షిణ బాన్‌హోంకు ఆరుమైళ్ల దూరంలో వస్తుండగా వీరి కారు, మరో కారు ఢీకొన్నాయి. అవతలి కారులో ఉన్నఇద్దరు భారతీయ మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. వీరి కారులో మంటలు వ్యాపించడంతో హరితారెడ్డి, శివ, గోపి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సాయితేజారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాద సమాచారంతో మృతుల కుటుంబాలు తల్లడిల్లాయి. రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాయితేజారెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని తానా సభ్యులకు ఫోను చేసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. మృతదేహాలను సకాలంలో స్వగ్రామాలకు తరలించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాజుపాళెంలో విషాదం



గోపి (ఫైల్‌ఫొటో)

ఓజిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అమెరికా ప్రమాదంలో ఓజిలి మండలం రాజుపాళేనికి చెందిన తిరుమూరు గోపి మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. గోపికి 2021 మేనెల 5న నెల్లూరుకు చెందిన అపర్ణతో వివాహం జరిగింది. ఈమె ప్రస్తుతం నెల్లూరులోనే ఉన్నారు. ఈ నెల 27న భర్త వద్దకు వెళ్లేందుకు అన్నీ సిద్ధం చేసుకుని ఉన్నట్లు గోపి తలిదండ్రులు తెలిపారు. కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన గోపి తలిదండ్రులు రవీంద్ర, సుదర్శనమ్మ 25 ఏళ్ళ కిందట రాజుపాళెంకు వచ్చి హోటల్ వ్యాపారంలో స్థిరపడ్డారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడిన కొడుకు మృతి చెందటంతో తల్లడిల్లిపోతున్నారు. మృతదేహం వచ్చేందుకు మరో మూడు, నాలుగు రోజులు పడుతుందని బంధువులు తెలిపారు.



వార్డుల్లోనూ గొడుగు పట్టాల్సిందే

తిరుపతి రుయాస్పత్రి బయటే కాదు.. లోపలా వర్షానికి రోగులు ఇబ్బంది పడ్డారు. పలు వార్డుల్లోని భవనాలు శిథిలదశలో ఉండటంతో వర్షానికి వాటిల్లో నుంచి నీరు కారి నేలంతా తడిసి ముద్దయింది. రోగులు, వారి సహాయకులూ తడిచారు. వార్డుల్లో నుంచి వచ్చే క్రమంలోనూ, పరీక్షలకోసం బయటకు వెళ్లేటపుడు.. ఆస్పత్రికి వెళ్లే సమయంలో వానకు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా ఓపీ, ఎంఎం, ఎఫ్ఎస్, వార్డుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపించింది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

రెక్కే..ఇంతుంటే!

ఓజిలి సమీపంలో పెద్దపరియ క్రాస్ రోడ్డు దగ్గర జాతీయ రహదారి మీద నిలబడివున్న ఈ రైలంత లారీని దారిన పోయేవాళ్లంతా ఆగి మరీ చూశారు. ఏ రాకెట్టునో లారీ మోసుకుపోతోందేమో అని కళ్లింత చేసుకున్నారు. తీరా ఆరా తీస్తే.. అది విండ్‌మిల్‌లో ఉండే ఒక రెక్క మాత్రమే. రెక్కే ఇంతుంటే కరెంటును పుట్టించే ఆ గాలిఫ్యాను ఇంకెంత ఉంటుందో అని విస్తుపోయారు.

- ఓజిలి, ఆంధ్రజ్యోతి





కొండూరుపాళెం వద్ద సముద్ర ముఖద్వారాలు

పాలకుల నిర్లక్ష్యం మత్స్యకారులపాలిట శాపంగా మారింది. సముద్ర ముఖద్వారంలో మేట వేసిన పూడికను తీయకపోవడం వల్ల వేలాది మంది ఉపాధికి ముప్పు వాటిల్లింది.

- సముద్ర ముఖద్వారంలో పేరుకుపోతున్న మేట
- పులికాట్‌లో తగ్గిపోతున్న నీటిమట్టం
- తరిగిపోతున్న మత్స్య సంపద
- పూడిక తీయక ఉపాధి కోల్పోతున్న జాలర్లు

సముద్ర ఘోష

వాకాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండూరుపాళెం, పూడిరాయదొరువు సముద్ర ముఖద్వారం వద్ద లోతు కనీసం 10 నుంచి 15 అడుగులు ఉండాలి. ప్రస్తుతం 5 అడుగుల లోతు మాత్రమే ఉంది. ఇందువల్ల పడవలు సముద్రంలోకి వెళ్లేందుకు వీలు కావడం లేదు. ఇక్కడ పడవలు చిక్కుకుపోతున్నాయి. పడవలు సముద్రంలోకి వెళ్లకపోతే చేపలవేట సాధ్యం కాదు. కొండూరుపాళెం, తూపిలిపాళెం మత్స్యకార గ్రామాల నుంచి బకింగ్‌హాం కెనాల్‌లో మూడు కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తే సముద్ర ముఖద్వారం వస్తుంది. మార్చి నెల నుంచి సెప్టెంబరు, అక్టోబరు దాకా ముఖద్వారం వద్ద ఇసుకమేట వేస్తుంటుంది. ఎక్కడ ఎంత లోతు, మెరక ఉందో అంచనా వేయడం కష్టం. దీంతో మేట వేసిన ప్రాంతాల్లో మరపడవలు చిక్కుకుపోయి దెబ్బతింటున్నాయి. నాయకులకు, అధికార్లకు ఈ సమస్య గురించి మత్స్యకార్లు చెప్పుకుంటూనే ఉన్నారు. జగన్ ప్రభుత్వంలో సాగరమాల అంటూ హడావుడి చేసి మాయ చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది గనుక ఇప్పుడైనా పూడిరాయదొరువు, కొండూరుపాళెం వద్ద హార్బర్ ఏర్పాటుచేసి తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఈ ప్రతిపాదన ఏమైంది?

రాయదొరువు వద్ద ముఖద్వారాలు లోతు తీయాలని కేంద్ర జల సంఘం నిపుణుల కమిటీ 2015లోనే సిఫారసు చేసంది. ఇందుకు రూ.48 కోట్లు ఖర్చు అవుతుందని కూడా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

జగన్ మాయ

సాగరమాల ద్వారా 160 కోట్లతో పూడిరాయదొరువు వద్ద హార్బర్ ఏర్పాటు చేసేందుకు మరొక ప్రతిపాదన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ హైలెవల్ కమిటీ, జాతీయ తీరప్రాంత పరిశోధన సంస్థ, ఎండోమర్ కోస్టల్ హైడ్రాలిక్ డైరెక్టర్లు ఈమేరకు నివేదికలు తయారు చేశారు. పూడిరాయదొరువు వద్ద సముద్రంలోకి 2 కిలోమీటర్ల పొడవు, 400 మీటర్ల వెడల్పు, 12 అడుగుల లోతు ఉండేలా గోడలను నిర్మించాలని సూచించారు. ఇందువల్ల పెద్ద ఓడలను కూడా నిలుపుకునేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. 2022లో జగన్ ప్రభుత్వం పెద్ద హడావుడే చేసింది. పనులు ప్రారంభిస్తున్నామంటూ ప్రకటించారు. అంగుళమైనా ముందుకు తీసుకువెళ్లలేదు. జాలర్ల ఓట్ల కోసం ఆర్భాటపు ప్రకటనలు చేసి చేతులెత్తేశారు.

- **పులికాట్ విస్తీర్ణం:** ఆంధ్రప్రదేశ్‌లో 400కి.మీ., తమిళనాడులో 61కి.మీ.
- వాకాడు, చిల్లకూరు, కోట, సూళ్లూరుపేట, తడ మండలాల్లో ఉన్న మర పడవల సంఖ్య: 362.
- చేపల వేట ఉపాధిగా గల కుటుంబాలు: 60వేలు.

తమిళ జాలర్లతో గొడవలు

ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో ఉన్న పులికాట్ సరస్సులో మనవైపు సముద్ర ముఖద్వారాలకే ఈ సమస్య అంతా. ముఖద్వారాలు పూడిపోవడంతో పులికాట్ సరస్సులో నీటి మట్టం కూడా తగ్గిపోతోంది. మత్స్య సంపద వృద్ధి కాదు. ఇదే తమిళనాడు పరిధిలోని ముఖద్వారాలు తెరుచుకొని ఉన్నాయి. ఎప్పటికప్పుడు తమిళనాడు ప్రభుత్వం పూడిక తీత పనులు చేపడుతూ ఉంటుంది. దీంతో ఆ ప్రాంతంలో నీరు పుష్కలంగా ఉంటుంది. ఇందువల్ల తమిళ జాలర్లు ఏడాది పొడవునా వేట సాగిస్తున్నారు. ఆంధ్ర పరిధిలోనే సరస్సు అధికభాగం ఉన్నా మన జాలర్లకు ఉపాధి కరువవుతోంది. పూడిరాయదొరువు, కొండూరుపాళెం ప్రాంతాల వద్ద లోతు తక్కువగా ఉండటంతో వేట సమయంలో ఆంధ్ర జాలర్లను తమిళ జాలర్లు అడ్డుకుంటూ ఉన్నారు. ఇందువల్ల తరచూ ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి.



తిరుమల ఘాట్‌లో విరిగి పడిన కొండచరియలు



తిరుమల ఘాట్‌రోడ్డులోని చివరిమలుపు వద్ద పడిన కొండచరియలు

తిరుమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాల నేపథ్యంలో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌రోడ్డులోని మూడుప్రదేశాల్లో బుధవారం కొండచరియలు విరిగిపడ్డాయి. వర్షపు నీటిలో బాగా నానిపోయిన కొండచరియలు 15వ కిలోమీటరు, హరిణి ప్రాంతం, భాష్యకార్ల సన్నిధి ప్రాంతాల్లో పడ్డాయి. అయితే సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వీటిని ఎక్స్‌కవేటరు, ట్రక్కులు, ట్రాక్టర్ల సహాయంతో వేగంగా తొలగించారు. పైగా రోడ్డుకు పక్కభాగాల్లోనే పడటంతో వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. మరికొన్ని ప్రదేశాల్లోనూ కొండచరియలు విరిగిపడే అవకాశాలున్నట్టు గుర్తించిన అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. అక్కడ కూడా కొండచరయిలు విరిగిపడే వెంటనే స్పందించి తొలగించేలా అప్రమత్తంగా ఉన్నారు. ఇక, జీఎన్సీ, అలిపిరి వద్ద వాహనదారులను భద్రతాసిబ్బంది అప్రమత్తం చేసి ఘాట్‌రోడ్లలోకి అనుమతిస్తున్నారు. ఇక, తిరుమలలో బుధవారం విడతలవారీగా కురిసిన వర్షంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. దర్శనానికి వెళ్లే సమయంలోను.. దర్శనం పూర్తి చేసుకుని ఆలయం వెలుపలకు వచ్చాక తడుస్తూనే వెళ్లారు. కొందరు గొడుగుల్లో, మరికొందరు తమ వద్దనున్న వస్త్రాలు కప్పుకుని వెళ్లారు. చలి కూడా పెరిగింది. భారీ వర్షాల నేపథ్యంలో పాపవినాశనం, శ్రీవారిపాదాల మార్గాలను టీటీడీ మూసివేసింది. బుధవారం ఉదయానికి తిరుమలలోని ఐదు డ్యాముల్లో 250 లక్షల గ్యాలన్ల నీరు చేరింది.

కొండ చరియలపై ప్రత్యేక నిఘా

ఘాట్ రోడ్లలోని కొండచరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. బుధవారం ఆయన అధికారులతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. విపత్తుల నిర్వహణ ప్రణాళికలపై చర్చించి పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కొండచరియలపై ప్రత్యేక నిఘా ఉంచి ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తగా జనరేటర్ల కోసం డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, సీవీఎస్వో శ్రీధర్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారిమెట్టు మార్గం మూసివేత

భారీ వర్షాల నేపథ్యంలో తిరుమలకు నడిచివచ్చే మార్గాల్లో ఒకటైన శ్రీవారిమెట్టు మార్గాన్ని టీటీడీ గురువారం మూసివేయనుంది. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈనిర్ణయం తీసుకుంది. వర్షాలు అధికంగా కురిసిన నేపథ్యంలో ఆమార్గంలో వరద నీరు అధికంగా ప్రవహిస్తుంది. ఈక్రమంలో టీటీడీ గురువారం ఒక్కరోజు తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయం తీసుకుంది.



గొడుగుల్లో వెళుతున్న భక్తులు

స్వర్ణముఖి నదిలో జలకళ



బుధవారం.. పెరిగిన నీటిమట్టం



మంగళవారం స్వర్ణముఖి నది ఇలా..

శ్రీకాళహస్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నది జలకళ సంతరించుకుంది. శ్రీకాళహస్తీశ్వరాలయం పక్కన స్వర్ణముఖి నది మంగళవారం వరకు మురుగునీటితో కళావిహీనంగా దర్శనమిచ్చింది. రెండురోజుల పాటు ఎడతెరపిలేకుండా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో బుధవారం మధ్యాహ్నం నుంచి స్వర్ణముఖి నదిలో నీరు చేరింది. సాయంత్రానికి నదిలో జలకళ సంతరించుకుంది.



అరణియార్‌కు పెరుగుతున్న వరద

పిచ్చాటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో అరణియార్ రిజర్వాయర్‌కి అరుణానది నుంచి గంటకు 1660 క్యూసెక్కుల నీరు చేరుతుంది. దీంతో బుధవారం సాయంత్రానికి 20.6 అడుగుల మేరకు నీటి మట్టం చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 31 అడుగులు కాగా 29 అడుగుల మేరకు నిల్వ చేస్తారు. దీంతో రిజర్వాయర్‌లో 1.85 టీఎంసీల నీరు చేరుతుంది. బుధవారం సాయంత్రం డీఎల్‌పీవో ప్రభురెడ్డి గ్రామ కార్యదర్శితో కలసి ప్రాజెక్టును పరిశీలించారు.

'కల్యాణి డ్యామ్'కు చేరని నీరు

చంద్రగిరి, ఆంధ్రజ్యోతి: మూడు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తున్నా చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యామ్‌లో వరద నీరు చేరలేదు. మూడు రోజుల కిందట 844 అడుగుల నీటి మట్టం ఉందని అధికారులు తెలిపారు. శేషాచలం అడవుల్లో విస్తారంగా వర్షాలు పడితేనే డ్యామ్‌లోకి వరద నీరు వస్తుందన్నారు.



ఖాళీగా ఉన్న క్యూలైన్లు

ముక్కంటి ఆలయంలో తగ్గిన రద్దీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునే భక్తుల సంఖ్య బుధవారం తగ్గింది. ఎడతెరపిలేని జడివానతో శ్రీకాళహస్తికి విచ్చేసే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గారు. దీంతో బుధవారం ఆలయంలో క్యూలైన్లు ఖాళీగా కనిపించాయి.

128 మద్యం దుకాణాలు ప్రారంభం

- సాయంత్రం నుంచి స్టాకు కేటాయించిన అధికారులు



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం సాయంత్రం వరకు 128 మద్యం దుకాణాలు ప్రారంభించారు. తిరుపతి డివిజన్ పరిధిలో 141కి 66, గూడూరు డివిజన్ పరిధిలో 86కి 62 షాపులు తెరిచారు. వీటికి సాయంత్రం నుంచి మద్యం స్టాకు కేటాయించారు. మూడు గంటల పాటు దాదాపు 30 శాతం దుకాణాల్లో మద్యం విక్రయాలు జరిగాయని అధికారులు చెప్పారు. సోమవారం నాటి లాటరీ విధానంలో 227 మద్యం దుకాణాలను కేటాయించగా.. సాయంత్రానికి 225 మద్యం దుకాణాలకు లైసెన్సు ఫీజు కట్టారు. రాజకీయ ఒత్తిళ్లతో మిగతా రెండింటికి కట్టలేదు. కొత్త పాలసీ ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం దుకాణాలు తెరచి ఉంచుతారు. డిజిటల్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. మద్యం విక్రయాలపై రెండు శాతం సెస్ విధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మొత్తంలో నార్కోటిక్ నియంత్రణ చర్యలు, డీ అడిక్షన్, పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ఖర్చు చేస్తారని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు.

రుయాలో పాలియేటివ్ కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వృద్ధులకు, క్యాన్సర్ బాధితులకు ఇంటి వాతావరణాన్ని తలపించేలా చక్కటి సదుపాయాలతో రుయాస్పత్రిలో పాలియేటివ్(ఉపశమన సంరక్షణ) కేంద్రాన్ని సూపరింటెండెంట్ రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్‌లు బుధవారం ప్రారంభించారు. రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో వృద్ధులకు, క్యాన్సర్ బాధితులకు ప్రత్యేక వైద్యంతో పాటు వారికి ఏ విధమైన వైద్య సహాయం, ఆహారం అందించాలనే దానిపై సహాయకులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆలోచన మంచిదే అయినా ఈ కేంద్రాన్ని శిథిల భవనంలో ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రారంభించిన రోజునే చిన్నపాటి వర్షానికి స్లాబు ఉరుస్తుండడంతో గదుల్లోకి నీరు చేరింది. దీంతో ప్రారంభించేందుకు వచ్చిన నిర్వాహకులు సైతం అవాక్కయ్యారు. ఇందులో వృద్ధులను, క్యాన్సర్ బాధితులను ఉంచి వైద్యం అందిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, పునరాలోచన చేయాలని అధికారులను ఆదేశించారు.



మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిధిలో మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని బుధవారం వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఆరు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ జిల్లా నిమ్మకాయలపల్లికి చెందిన మేకలప్ప సాయి ప్రకాష్ కొర్లగుంట మారుతీనగర్‌లో కాపురమున్నాడు. సులభ సంపాదనకు ఆశపడి దొంగతనాలకు అలవాటుపడ్డాడు. స్విమ్స్, రుయా, వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లు చోరీ చేసి, విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు మొదలుపెట్టారు. బుధవారం తిరుపతి సైన్సు సెంటరు వద్ద సాయి ప్రకాష్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి రూ.5 లక్షల విలువ చేసే ఆరు మోటారు సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

విడవని వాన


గూడూరు మండలం విందూరు రోడ్డులో వర్షపునీరు


చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం వద్ద ఉప్పుటేరు నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో గోపి


గూడూరు మండలం చేమలపాళెం సమీపంలో పొలాల్లో వర్షపునీరు


ఓజిలి మండలంలో ఎల్లి పైర్ల పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

గూడూరు/చిల్లకూరు/దక్కిలి/పెళ్లకూరు/సూళ్లూరుపేట/దొరవారిసత్రం/నాయుడుపేట/కోట/ఓజిలి/బాలాయపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారడంతో రెండురోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం విడతల విడతలుగా మోస్తరు జల్లులు కురిశాయి. గూడూరు మండలంలో పలు గ్రామాల రోడ్లలో వర్షపునీరు నిల్వ చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. గూడూరు చెరువుకు కొద్దిగా నీరు చేరింది. రాగిచెరువు సమీపంలో ఇళ్లలోకి నీరు చేరకుండా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు చర్యలు చేపట్టారు. చిల్లకూరులోని లోతట్టు ప్రాంతమైన దశరధరామయ్య ఇంటిలోని వర్షపునీరు చేరింది. రెవెన్యూ అధికారులు ఇంటిలోని నీటిని మోటారు సాయంతో బయటకు పంపే ఏర్పాటు చేశారు. ఏరూరు గ్రామంలోని రోడ్డుపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ● తుఫాన్ కారణంగా చిల్లకూరు మండలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామని తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి చెప్పారు. బుధవారం వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలోని లోతట్టు ప్రాంతమైన వైఎస్సార్ కాలనీలో వర్షపునీరు నిల్వ చేరకుండా తహసీల్దారు శ్రీనివాసులు యంత్రాల సాయంతో కాలువ తీయించారు. తిప్పగుంటపాళెం సమీపంలోని ఉప్పుటేరు నీటిమట్టాన్ని ఎంపీడీవో గోపి పరిశీలించి స్థానికులకు సూచనలు అందజేశారు. ● దక్కిలి మండలంలో మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. వెలుగొండల నుంచి వర్షపునీరు చెరువుల్లోకి వచ్చి చేరుతోంది. వర్షాల వల్ల ఎక్కడా ఇబ్బందులు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకొన్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు. కైవల్యా నదికి భారీగా వర్షపు నీరు చేరుకోవడంతో మాటుమడుగు చప్టాపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం 32.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు.

కలవకూరు చెక్‌డ్యాంకు పోటెత్తిన వరద
7 మండలాలకు రాకపోకలు బంద్

పెళ్లకూరు మండలంలోని పలు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కలవకూరు చెక్ డ్యాంకు వరదనీరు పోటెత్తి చప్టాపై పారుతుండడంతో అధికారులు ఆ మార్గంలో రాకపోకలు నిలిపి వేశారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో దారికి ఇరువైపులా ట్రాక్టర్ ట్రాలీలను అడ్డుగా పెట్టి ముళ్ల కంపలు ఏర్పాటు చేశారు. దీంతో పెళ్లకూరు, బాలయ్యపల్లి, నాయుడుపనేట, ఓజిలి, వెంకటగిరి, తొట్టంబేడు, శ్రీకాళహస్తి మండల పరిధిలోని అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే మార్గంద్వారా మేనకూరు సెజ్‌కు వెళ్లే కార్మికులు రవాణా సౌకర్యం లేక అవస్థలు పడ్డారు. ఇక పెళ్లకూరు మండలంలోని పునబాక, పెరుమాళ్లపల్లి, అక్కగారిపేట గ్రామాలు జలమయం కావడంతో మూడు పూరిళ్లు కూలిపోయాయి. కానూరురాజుపాలెంలో ఉన్న వలస కూలీలకు సచివాలయ భవనంలో పునరావాసం కల్పించారు. మూడురోజులుగా మండలంలో 249 మి.మీ వర్షం పడగా బుధవారం ఒక్కరోజే 181 మి.మీ వర్షం కురిసింది. చెన్నప్ప నాయుడుపేట, నందిమాల, చెంబేడు, మోదు గులపాలెం గ్రామాల్లో ఎల్లిపైర్లు నీటమునిగాయి.

సూళ్లూరుపేటలో 220.4 మి.మీ

సూళ్లూరుపేటలో బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలతో పాటు పట్టణంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. నెర్రికాలువ, పుచ్చాకాలువలకు వర్షపునీరు చేరింది. ఇలుపూరు - మంగళంపాడు మధ్య నున్న దొండ్లకాలువ పైకి ఒక అడుగు పాటు వర్షపునీరు చేరింది. ఇప్పటి వరకు ఎటువంటి ప్రమాదం లేకపోయిన ఆర్డీవో కిరణ్మయి నేతృత్వంలో అధికారులు ఎప్పకప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తహసీల్దారు నరసింహా రావు దొండ్లకాలువతో కాళంగి నదిని పరిశీలించి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కోటపోలూరు రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు చేరడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. మన్నారు పోలూరు మార్గంలో చీపురుగుంట నీరు పొంగడంతో రోడ్డుపై నీరు చేరింది. వట్రపాలెం నుంచి 12మంది ని స్థానిక బాలికల ఉన్నత పాఠశా లలోని పునరావాస కేంద్రానికి తరలిం చారు. సూళ్లూరుపేటలో 220.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ● దొరవారిసత్రం మండలంలో మంగళ వారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు 112.8 మీ.మీ, అప్పటినుంచి సాయంత్రం వరకు 66.8 మీ.మీ వర్షపాతం నమోదైంది. వర్షాలతో చెరువులు, కాలువలకు జలకళ సంతరించు కొంది. ఎల్లి వరి పొలాల్లో వర్షపునీరు చేరింది. దొరవారి సత్రం, మేలుపాక, మినమనమూడి, అయ్యపాళెం, పోలిరెడ్డిపాళెం రైల్వే వంతెనల కిందకు వరద నీరు చేరడంతో ఆయా మార్గాల్లో రాకపోకలను ఎస్‌ఐ అజయ్‌కుమార్ నిలిపి వేశారు. తహసీల్దారు శైలాకుమారి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ● నాయుడుపేట మండలంలో మూడు రోజులుగా వర్షం విడతలు విడతలుగా కురు స్తూనే ఉంది. బుధవారం మామిడి కాలువకు వర్షపునీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పొలాల్లోకి నీరు చేరింది. మండలంలో తుఫాన్ ప్రభావంతో ఇప్పటి వరకు ఎటువంటి నష్టం జరగలేదని తహసీల్దారు గీతావాణి తెలిపారు.

పొంగిన బకింగ్‌హాం కెనాల్

కోట మండలంలోని గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం సముద్రతీరంలో అలజడి పెరిగింది. బీకర శబ్దాలతో అలలు ఎగిసిపడుతున్నాయి. గూడలి వద్ద స్వర్ణముఖి, మామిడి కాలువ నదిలోకి వరదనీరు చేరుతోంది. పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగిపోయాయి. కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలోని పునరావాసులకు తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, సీసీఎఫ్ ప్రతినిధి మల్లికార్జున్‌రావు బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. నార్త్ గిరిజన కాలనీ, కోటమ్మ గిరిజన కాలనీ, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీల్లో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు మధుయాదవ్, ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్ మోహన్‌తో పాటు ఎంపీడీవో వేణు, పంచాయతీ కార్యదర్శులు పర్యటించి స్థానికులకు భరోసా కల్పించారు. ● ఓజిలి మండలంలో తుపాను ప్రభావం పెద్దగా లేదు. బుధవారం ఉదయం 8 గంటలకు మండలంలో 85.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రోజంతా విరామం ఇస్తూ వర్షం కురిసింది. రెండు రోజులుగా కురిసిన వర్షం ఎలిదిపైర్లకు జీవం పోసిందని రైతులు అంటున్నారు. చెరువులు, పంట కాలువలకు అతి కొద్ది స్థాయిలోనే వర్షపు నీరు చేరింది. ● బాలాయపల్లి మండలంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతో జనజీవనం స్తంభించిపోయింది. తహసీల్దార్ శ్రీనివాసులు నిండలి సమీపాన ఉన్న కైవల్యానదిని పరిశీలించారు. ఎంపీడీవో వినీల్ కుమార్ హస్తకావేరి, కామకూరు గ్రామాల్లో పర్యటించి గిరిజనులతో మాట్లాడారు. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఇబ్బంది పడకుండా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ మోహన్ రాజు ఉన్నారు.


దొరవారిసత్రం మినమనమూడి రైల్వే అండ్ బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేసిన పోలీసులు






పెళ్లకూరు: కవలకూరు రహదారికి ఇరువైపులా ట్రాక్టర్ ట్రక్కులను అడ్డుపెట్టి ముళ్లకంపలు వేసిన అధికారులు - చిల్లకూరులో ఇంటిలోకి చేరిన వర్షపునీరు - నాయుడుపేటలో వర్షపునీటితో చెరువులా సాయిబాబా గుడివీధి - సూళ్లూరుపేట: కోటపోలూరు రైల్వే బిడ్జి కింద వరద నీరు - దక్కిలి మండలంలో మాటుమడుగు వద్ద వాగు ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు


తూపిలిపాళెం సముద్రతీరంలో ఎగిసిపడుతున్న అలలు

తీరంలో ఎగిసిపడుతున్న అలలు

వాకాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తూపిలిపాళెం సముద్రతీరంలో రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. బుధవారం సాయంత్రం తీరంలో 10 మీటర్ల మేర సముద్రం ముందుకురావడంతో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు, సముద్రతీరాన్ని పరిశీలించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. తూపిలిపాళెం, బాలిరెడ్డిపాళెం, దుగరాజపట్నం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. తుఫాన్ ప్రభావం మరో రెండు రోజుల పాటు ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రామయ్య సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సబ్‌కలెక్టర్

గూడూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా గూడూరు డివిజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టామన్నారు. తీరప్రాంతాల్లో ప్రత్యేకంగా అధికార బృందాలను ఏర్పాటు చేయడంతో ఎటువంటి నష్టాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలతో పాటు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా ఉండాలని సబ్‌కలెక్టర్ సూచించారు.

తల్లిని హత్యచేసిన తనయుడి అరెస్టు

చిల్లకూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తల్లిని హత్యచేసిన తనయుడిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన సుశీలమ్మ కుమారుడు మనోజ్ చెడు వ్యసనాలకు బానిసై తిరుగుతుండడంతో తల్లి మందలించింది. ఆగ్రహావేశానికి గురైన మనోజ్ ఈనెల 11న తల్లిని కర్రతో కొట్టి హత్యచేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కోట క్రాస్‌రోడ్డు బస్టాండు వద్ద మనోజ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

25న మార్కెట్ రుసుం వసూలుకు వేలం పాటలు

గూడూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్, మాంసం, చేపల దుకాణాలు, రోడ్డు మార్జిన్ వెంబడి దుకాణదారుల నుంచి దినసరి రుసుం వసూలు చేసేందుకు ఈనెల 25న మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.


నిండుగా ఉన్న కుదిరి చెరువు

చెరువులకు జలకళ

సూళ్లూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటి వరకు వరకు చుక్కనీరు లేకుండా నెర్రెలు బారిన సాగునీటి చెరువులు మూడు రోజుల కరుస్తున్న వర్షాలకు జలకళ సంతరించుకొన్నాయి. మండలంలో మొత్తం 68 చెరువులు ఉండగా అన్నింటికీ నీరు చేరుతోంది.




వెంకటగిరి పట్టణంలోని కాంపాళెం వద్ద గొడ్డేరువాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల - తడలోని పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ - కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో పునరావాసులకు బిర్యాని ప్యాకెట్లు అందజేస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

దాతలు ముందుకు రావడం అభినందనీయం: పాశిం


ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న శ్రీరామరక్ష సేవాసంఘం సభ్యులు

గూడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించిన సమయంలో బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీరామరక్ష కుటీరంలో శ్రీరామరక్ష సేవాసంఘం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.25వేలు చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ బాధితులకు అండగా నిలిచేందుకు నియోజకవర్గం పరిధిలోని పలువురు దాతలు రూ.3కోట్లకు పైగా సీఎం సహాయనిధికి విరాళాలు అందించడం జరిగిందన్నారు. మన ప్రాంతంలో తుఫాను ప్రభావం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, శ్రీకంటి రామమోహన్ రావు, చిట్టిబాబు, పవన్‌కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, గురుగుహ, శ్యాంసుదరరాజు తదితరులు పాల్గొన్నారు.

పొన్నవోలులో పిడిగుపాటు

చిల్లకూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నవోలు గ్రామానికి చెందిన పసల కోటయ్య ఇంటికి సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది. దీంతో సమీపంలోని ఇళ్లలోని విద్యుత్ వైర్లు, టీవీలు కాలిపోయాయి. గోడలు పగుళ్లిచ్చాయి. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ

వెంకటగిరి, సెప్టెంబరు 16: ఎడతెరపి లేని వర్షం కారణంగా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న కూలీలు, నిరుపేదలకు స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో బుధవారం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పౌష్టికాహారం అందజేత

నాయుడుపేట టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం తిమ్మాజికండ్రిగలో బుధవారం వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం తల్లి, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. తల్లి, పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు దాదాపు 200 మందికి పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, చిన్నపిల్లల డాక్టర్ మాల్యాద్రి, గైనకాలజిస్టు దీప్తి, జనరల్ ఫిజిషియన్ సంపత్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీజీఎం

తడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్ సీజీఎం ఆదిశేషయ్య తడ సబ్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసులు, డీఈఈ శేఖర్, ఏఈ మురళి ఉన్నారు.

పల్లెపండుగ

బాలాయపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండంలోని పంచాయతీల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. హస్తకావేరిలో రూ.పది లక్షలు, పిగిలాం పంచా యతీ జార్లపాడులో రూ.పది లక్షలు, కోటం బేడులో రూ.ఎనిమిది లక్షలు, కామకూరులో రూ.ఎనిమిది లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఎంపీడీవో వినీల్‌కుమార్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్ రాజు, ఏపీవో మృత్యుంజయరావు, సర్పంచులు మద్దూరు రమణమ్మ, పల్లిపాటి మస్తానమ్మ, నాయకులు మాధవ నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేతిబోరుకు మరమ్మతులు

దొరవారిసత్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మకండ్రిగ గ్రామానికి డైరెక్ట్ పంపింగ్ వాటర్ స్కీమ్ ఉంది. అయితే కరెంటు లేని సమయంలో తాగడానికి నీళ్లు లేక ఇబ్బంది పడుతుండడంతో టీడీపీ నాయకుడు వేమసాని నాగేంద్ర నాయుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రామయ్య బోరును రిపేరు చేయించారు.

పునరావాస కేంద్రాల పరిశీలన



పునరావాస కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, అక్టోబర్ 16 (ఆంధజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బుధవారం తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్‌గౌడ్ పరిశీలించారు. చిట్టమూరులోని ఎస్సీ వసతి గృహం, గునపాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహించే అధికారులకు సూచనలు ఇచ్చారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఆయా పంచాయతీల్లోనే ఉండాలని, వర్షం వల్ల ఇబ్బందులు ఎదురైతే లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు.


మడుగును తలపిస్తున్న చెన్నూరు జగనన్న కాలనీ

వర్షం పడితే జగనన్న కాలనీవాసులకు తిప్పలే


బురదమయంగా కాలనీలోని రోడ్డు

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీవాసులకు వర్షంపడితే అవస్థలు తప్పడంలేదు. చిన్నపాటి వర్షానికే నివాసగృహాల వద్ద నీరు నిల్వచేరి మడుగులను తలపిస్తుండడంతో పాటు అంతర్గత రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడాల్సివస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చెన్నూరులోని జగనన్న కాలనీలో గతంలో 113 గృహాలను మంజూరు చేశారు. వీటిలో 73 ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం ఈ కాలనీలో 40 కుటుంబాల వరకు నివాసముంటున్నారు. కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాలువలను అభివృద్ధి చేయకపోవడంతో చిన్నపాటి వర్షానికే నివాస గృహాల చుట్టూ నీరు నిల్వచేరి ఇబ్బందికరంగా మారుతోంది. అధికారులు స్పందించి కాలనీలో వసతులను మెరుగు పరచాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వృద్ధులకు రెయిన్ కోట్‌లు, దుప్పట్లు అందజేత

నాయుడుపేట టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సంజయ్ గాంధీ కాలనీలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం రైయిన్‌కోట్‌లు, దుప్పట్లు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అందజేశారు.